12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 30 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల ఆదివారం 4 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 30 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA SUN 4 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను

## తక్షణమే రద్దు చేయాలి

- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో

- మిగతా 2లో

# అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..

## రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్



- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందన్న ఆర్‌బీఐ గవర్నర్
- ఆర్థిక ముప్పులపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్న మల్హోత్రా
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని వెల్లడి
- వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ప్రకటన
- ఆర్థిక సమస్యలు ఒక్కసారిగా బయటపడొచ్చని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

- మిగతా 2లో



## ఆ నీచులను వదిలిపెట్టను

### ఎన్టీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్

పెన్ పవర్ డెస్క్: సామాజిక మాధ్యమాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతను ఉపయోగించి అసభ్యకర రీతిలో వీడియోలను క్రియేట్ చేయడంపై అగ్రకథానాయకుడు ఎన్టీఆర్ తీవ్ర ఆగ్రహం

- మిగతా 2లో

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

### సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్



- యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి
- ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్
- సీట్ల పంపకాలపై అక్టోబర్‌లో జరిగే చర్చల్లో అఖిలేశ్‌దే తుది నిర్ణయమని వెల్లడి
- పొత్తు వల్ల కాంగ్రెస్‌కే అధిక ప్రయోజనమని వ్యాఖ్య
- 150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్

- మిగతా 2లో

## రైతులపై ప్రేమ ప్రచారానికే పరిమితం



పెన్ పవర్ డెస్క్:ఏపీలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు శంకుస్థాపన సందర్భంగా మదనపల్లి సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. హార్టికల్చర్ పై చంద్రబాబు మాటలు డ్రామాలని..బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు జగన్. రైతులపై చంద్రబాబు ప్రేమ

- మిగతా 2లో





## క్వా-శివ, అమరావతి

# డిక్లరేషన్..

### పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
- హాజరైన సీఎం చంద్రబాబు
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి

- మిగతా 2లో

# 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన..

## నేడు తెనాలికి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

- పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ
- గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో రేపు ఈ కార్యక్రమం
- గత 28 నెలల్లో ప్రభుత్వం 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (PMAY-G) 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి (అక్టోబరు 4) భూమిపూజ చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇటీవలే ఈ 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ కార్యక్రమంతో పాటు, గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా

- మిగతా 2లో



## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం
- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో

- మిగతా 2లో



## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

### చివరి నిమిషంలో కీలక నిర్ణయం!

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ

పెన్ పవర్ డెస్క్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా

- మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

- బీసీలకు అధికారం దక్కకూడదని వైసీపీ కుట్ర చేసిందన్న రామ్మోహన్ నాయుడు
- రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని వెల్లడి
- టీడీపీకి బీసీలు వెన్నెముక వంటివారని వ్యాఖ్య

- మిగతా 2లో



## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది



### పాన్ ఐఐటీ సమ్మిట్ లో మంత్రి లోకేశ్

- విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ఉద్ఘాటన
- చంద్రబాబు అనుభవానికి యువ ఎమ్మెల్యేల బృందం తోడైందని వెల్లడి

- మిగతా 2లో




## ఫ్లైట్‌లో దాడి ముందస్తు పథకమా ?

ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌పై దాడి జరగడం కలకలం రేపింది. అది కూడా కో పైలట్ ఈ పని చేయడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. మచ్చుర్‌పై దాడికి యత్నించిన కో-పైలట్ హమామ్ అల్-హమామీకి సంబంధించి పలు కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం, అతడి పాత సోషల్ మీడియా అకౌంట్లు పరిశీలనలో అల్-ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తుల ఫోటోలు, ఇతర అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన సమాచారం లభించాయి. యూఏఈ అటార్నీ జనరల్ ఈ ఘటనపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఉగ్రదాడి, హైజాక్ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.నివేదికల ప్రకారం, హమామ్ అల్-హమామీ ఒమన్‌కు చెందిన పౌరుడు. అతడు యూఏఈ లో జన్మించాడని కొన్ని నివేదికలు చెబుతుండగా.. అతని తండ్రి ఒమన్ పౌరుడని, తల్లి సిరియాకు చెందిన వ్యక్తి అని తెలిసింది. అతడు కొన్నేళ్లపాటు యూఏఈలో గడిపాడు. అతని పేరుతో ఉన్న లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం, ఒమన్ ఎయిర్‌లో దాదాపు ఏడేళ్లు పనిచేశాడు. ఆ తర్వాత రాయల్ ఎయిర్ మరోక్ తో అనుబంధం కలిగి ఉన్నాడు. ఆ తర్వాత ఫ్లైదుబాయ్‌లో కో-పైలట్‌గా చేరి సేవలు అందిస్తున్నాడు.024లో నిందితుడు, కో పైలట్ హమామ్ అల్ హమామీని ఒమన్ ఎయిర్‌లో ఫ్లైట్ ట్రైనింగ్ నుంచి తప్పించారు. తీవ్రవాద భావజాలం వల్ల ఆకర్షితుడు అవుతున్నాడని అతడిపై అనుమానం వచ్చింది. దాంతో తలెత్తిన భద్రతా పరమైన ఆందోళనలే అతడ్ని తొలగించడానికి కారణమని సమాచారం. అతడిని ఎయిర్‌లైన్ నుంచి పూర్తిగా తొలగించకుండా ఇతర, నాన్-ఫ్లయింగ్ బాధ్యతలు అప్పగించారని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. అయితే, ఆ సమయంలో అతని సమాచారాన్ని ఇతర ఎయిర్‌లైన్స్ లేదా సంబంధిత దేశాల సంస్థలతో ఎంతవరకు పంచుకున్నారనే అంశంపై స్పష్టత లేదు. సీఎన్ఎన్ నివేదిక ప్రకారం, హమామ్‌కు సంబంధించిన సోషల్ అకౌంట్లలో కొన్ని అనుమానాస్పద ఫోటోలు, వీడియోలు లభించాయి. అందులో అల్-ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తులు కనిపిస్తున్నారు. ఒక వీడియోలో బోయింగ్ 737 మాక్స్ కాక్‌పిట్ నుంచి వేర్వేరు విమానాల రికార్డింగ్ కనిపిస్తుంది. వీడియో చివరలో అల్-ఖైదా మాజీ చీఫ్ ఐమన్ అల్-జవాహిరీ, 2009లో జుగా అధికారుల హత్యతో సంబంధం ఉన్న హుమామ్ ఖలీల్ అబూ-ములాల్ అల్-బలావీల ఫోటోలు ఉన్నాయని గుర్తించారు. ఈ పోస్టులపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఆ తర్వాత సోషల్ మీడియా ప్రొఫైళ్లు తొలగించారు.నివేదికల ప్రకారం, మరొక సోషల్ పోస్ట్‌లో ఏఐ సాయంతో తయారు చేసిన ఒక ఫొటో ఉంది. అందులో మక్కా, మదీనా, జెరూసలేంలను ఒక మెరుస్తున్న గీతతో కలిపాడు. దీంతో పాటు మరణం, అవమానానికి సంబంధించిన పదాలతో ఉన్న ఒక కవిత ఉన్నాయి. ఈ పోస్టులకు ప్రమాదంతో నేరుగా సంబంధం ఉందో లేదో దర్యాప్తులో తేలనుంది.సీఎన్ఎన్ నిపుణుల ప్రకారం, హమామ్ పాత, ఇప్పుడు తొలగించిన సోషల్ మీడియా పోస్టులలో మహిళల పట్ల కఠినమైన అభిప్రాయాలు ఉన్నాయి. పెళ్లి తర్వాత భార్య ఉద్యోగం చేయకూడదని, నిఖాబ్ ధరించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. మరికొన్ని పోస్టులలో పురుషులు, మహిళలు కలసి పనిచేసే వర్క్ స్పేస్ లను పూర్తిగా వ్యతిరేకించాడు. సీఎన్ఎన్ 2021, 2022 నాటి దాదాపు 3,000 తొలగించిన పోస్టులను విశ్లేషించారు. ఈ పోస్టుల ద్వారా అతని వ్యక్తిగత, మతపరమైన ఆలోచనలు ఉన్నాయి. అయితే ఒక వ్యక్తి సోషల్ మీడియా ఆలోచనలకు, ఒక నేర సంఘటనకు నేరుగా లింక్ ఉందా లేదా అనే కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోంది.30 సెప్టెంబర్ 2026న ఫ్లైదుబాయ్ విమానం ఫ్లై1073 దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తుండగా కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య గొడవ జరిగింది. కో పైలట్ హమామ్ అల్ హమామీ దాడిలో భారత కెప్టెన్ స్మిత్ మచ్చుర్ గాయపడ్డారు. యూఏఈ అధికారిక సమాచారం ప్రకారం, ఈ ఘటన తర్వాత విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ ఎయిర్ పోర్ట్ వైపు మళ్లించి అక్కడ ల్యాండ్ చేశారు. ప్రయాణికులు, విమానంలో ఉన్న ఇతర క్రూ సభ్యులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యూఏఈ జనరల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ తరువాత కెప్టెన్ స్మిత్ మచ్చుర్ సురక్షితంగా యూఏఈకి తిరిగి రాగా, వైద్య చికిత్స కొనసాగుతోంది.

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు.ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు.

ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఆ నీచులను వదిలిపెట్టను

- మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు. దేవర సినిమాలోని 'చుట్టమల్లే' పాట వీడియోను ఏఐతో మార్ఫింగ్ చేయడంపై ఆయన మండిపడ్డారు. మహిళలను పూజించే దేశంలో వారి గౌరవాన్ని దిగజార్చారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వారిని వదిలిపెట్టబోనని, బాధ్యులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు."ఇది అత్యంత అసహ్యకరమైన చర్య. మహిళలను తల్లులుగా, దేవతలుగా పూజించే నేల మనది. 'మాతృదేవోభవ' అనే నినాదం మన సంస్కృతిలో భాగమైన చోట.. కొందరు వ్యక్తులు అత్యంత దిగజారి ప్రవర్తిస్తున్నారు. ఒక మహిళను అవమానించేలా ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి నీచమైన కంటెంట్‌ను సృష్టించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే' పాట మార్ఫింగ్ వీడియో వెనుక ఉన్న నీచులు ఎవరినీ వదిలిపెట్టను" అని ఎన్టీఆర్ హెచ్చరించారు.

ఇక ఇలాంటి అసభ్యరమైన కంటెంట్‌ను ఎవరూ చూడొద్దని ఎన్టీఆర్ విజ్ఞప్తి చేశారు. "ఈరోజు వేరొక మహిళకు ఇలాంటి అవమానం జరిగింది. రేపు మీ ఇంట్లో మీ తల్లి, భార్య, కుమార్తెకూ ఇదే పరిస్థితి ఎదురవ్వొచ్చు. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడానికి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్రంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కఠినమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను" అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.ఏఐ మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీల పాలిట నరకంగా మారాయి. ఇటీవల 'అర్జున్ రెడ్డి' హీరోయిన్ శాలిని పాండే కూడా దీని బారిన పడ్డారు. ఆమెపై అసభ్యకర రీతిలో వీడియోలను రూపొందించగా అవి వైరల్ అయ్యాయి. దీనిపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీని ఇలా ఉపయోగించడం సరికాదంటూ మండిపడ్డారు. ఆ వీడియో కనిపిస్తే ఎవరూ షేర్, డౌన్‌లోడ్ చేయొద్దని.. వెంటనే రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రష్మిక, కత్రినా కైఫ్, మృణాల్ ఠాకూర్, కీర్తి సురేశ్‌కు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోలు కూడా వైరలైన సంగతి తెలిసిందే.

## రైతులపై ప్రేమ ప్రచారానికే పరిమితం

- మొదటి పేజి తరువాయి

ప్రచారానికే పరిమితమని.. చంద్రబాబు పాలనలో ధరల స్థిరీకరణ నిధి నిర్వీర్యమైందని అన్నారు జగన్.చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పథకం రద్దు చేశారని అన్నారు. రాయలసీమలో 7-8 లక్షల బోర్లు ఎండిపోయాయని.. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు చంద్రబాబే అడ్డంకి అని అన్నారు జగన్. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కరువు నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు జగన్. తీవ్రమైన కరువు కారణంగా రాయలసీమలో ఇప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొంటే, వేలాది ఎకరాల్లో హార్టికల్చర్ తోటలు ఎండిపోతుంటే, మీరు వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక హార్టికల్చర్ హబ్ సంగతి పక్కనపెడితే, రైతుల ఆత్మహత్యలకు చిరునామాగా రాయలసీమ సహా రాష్ట్రం మొత్తం తయారయ్యిందని... మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టి, రైతులకు ఊరటనిచ్చేలా తక్షణమే కరువు నివారణా చర్యలు మొదలుపెట్టండని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు జగన్.

# క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్..

- మొదటి పేజి తరువాయి

పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు.క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

**అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం**

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

**క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది

ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026'లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు.

"ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు.

**అభివృద్ధికి '3ఎ' మంత్రం**

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం '3ఎ' మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. "మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి" అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ AI ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు.

**అమలుపైనే దృష్టి.. ఇవే మా నిదర్శనాలు**

కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది" అని తెలిపారు.

"ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్లు తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ.3,000 కోట్ల నుంచి రూ.23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని లోకేశ్ పేర్కొన్నారు.

**23 క్లస్టర్ల ఏర్పాటు.. అమరావతిపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో హార్టికల్చర్ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు 23 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెన్యువబుల్ ఎనర్జీలో ఏడాదిలోనే 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని లోకేశ్ వెల్లడించారు. అమరావతి నిర్మాణంపై మాట్లాడుతూ, "మీరు అమరావతికి వస్తే, నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ డిజైన్లతో అసెంబ్లీ, సచివాలయం వంటివి నిర్మిస్తున్నాం. ఇక్కడ 5,000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించబోతున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో శంషాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రను ఇది పోషిస్తుంది" అని అన్నారు.

**ఐఐటీయన్లకు రెండు విజ్ఞప్తులు**

ఈ సందర్భంగా పాన్ ఐఐటీ కమ్యూనిటీకి లోకేశ్ రెండు విజ్ఞప్తులు చేశారు. "మొదటిది, ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్ల పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని మా 23 క్లస్టర్ల అభివృద్ధికి

అందించాలి. రెండోది, 'జుగాడ్' మోడల్ నుంచి 'వ్యవస్థీకృత వేగం' వైపు ఏపీ ప్రయాణించడానికి, ఏఐ సాయంతో మెరుగైన పాలన అందించడానికి మీరంతా సహకరించాలి. ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం కాదు, భారత్ ఏం చేయగలదో ప్రపంచానికి చూపించాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శంగా నిలపాలనుకుంటున్నాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

## యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు.కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై

చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు.కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..

### రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్

- మొదటి పేజి తరువాయి

కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు.

అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

**ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు**

బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు.అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..

- మొదటి పేజి తరువాయి

వెల్లడికాలేదు.షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు.హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

## 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన..

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి.పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అత్యంత వేగంగా, తక్కువ శ్రమతో నిర్మాణం పూర్తి చేయడం, నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నాణ్యత, పటిష్ఠతను పెంచడం సాధ్యమవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం 10:15 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 10:35 గంటలకు బుర్రిపాలెం చేరుకుంటారు. ఉదయం 10:40 గంటలకు 3డీ ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు భూమిపూజ చేసి, అనంతరం లబ్ధిదారులతో సమావేశమవుతారు. 11:10 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 1:35 గంటలకు తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## గుంటూరు పశ్చిమలో రూ.8.50 కోట్లతో అభివృద్ధి పనులు ఎమ్మెల్యే గళ్ళా మాధవి




**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 03,**
గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.8.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం శంకుస్థాపన చేశారు. 21, 25, 43, 45, 49వ డివిజన్ల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, అవుట్‌ఫాల్ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. గత రెండేళ్లలో ఈ ప్రాంతాల్లో ఇప్పటికే రూ.53 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామని, తాజా పనులతో కలిపి మొత్తం రూ.70 కోట్లకు చేరువలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు రూ.400 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న ఏడాదిలో మౌలిక వసతుల సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పెనమలూరు లో కొనసాగుతున్న అభివృద్ధి పరంపర..
## పల్లె పండుగ 3.0 గ్రామాలకు మహర్దశ:-ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు మండలం పరిధిలోని గంగూరు, వణుకూరు, చోడవరం గ్రామాల్లో అంతర్గత రహదారులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ 46 లక్షల వ్యయంతో ఆరు అంతర్గత రహదారులకు శంకుస్థాపన
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ..
రాష్ట్రవ్యాప్తంగా అతిపెద్ద పండుగ జరుగుతుంది
పల్లె పండుగ 3.0 తో గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయని తెలిపారు
పల్లె పండుగ 1.0లో 26 కోట్లు, పల్లె పండుగ 2.0లో సాస్కి నిధులు 11 కోట్ల రూపాయలు వివిధ గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు పల్లె పండుగ 3.0 తో 8.5 కోట్ల రూపాయలతో గ్రామాలలో పెండింగ్లో ఉన్న అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు ప్రతిరోజు జరిగిన అభివృద్ధి పనులను పేపర్ రూపంలో విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు
గంగూరు గ్రామంలో గత మూడు ఎన్నికలలో తనకు మెజారిటీ రాకపోయినా అభివృద్ధిలో మాత్రం రాజీ పడే ప్రసక్తి లేకుండా పనిచేస్తున్నామన్నారు
గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లను పునః నిర్మిస్తున్నామని వెల్లడించారు
ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.
అభివృద్ధితో పాటు సంక్షేమం సమపాళ్లల్లో అందిస్తున్నామని పేర్కొన్నారు
ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## రాజముద్ర అనేది రైతుకు గౌరవం లాంటిది:-ఎమ్మెల్యే బోడె ప్రసాద్



**పెన్ పవర్,కృష్ణాజిల్లా పెనమలూరు, అక్టోబర్ 03**
పెనమలూరు గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు
రైతులకు స్వయంగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..
పెనమలూరు గ్రామంలో 853 రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించడం సంతోషంగా ఉందన్నారు
గత వైసిపి ప్రభుత్వం రాజ్యాంగమైన పట్టాదారు పాసుపుస్తకాలపై తన సొంత ఫోటోలు వేసుకొని రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు
కూటమి ప్రభుత్వంలో ఎలాంటి వ్యక్తిగత ప్రచారాలకు తావు లేకుండా అధికారిక రాజముద్రతో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు
రెవెన్యూ రికార్డులలో పొరపాట్లు లేకుండా పూర్తి భూమి విస్తీరాన్ని తెలుపుతూ రాజముద్రతో పాస్ పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు
వీటి ద్వారా రైతులు ఏ విధంగానూ నష్టపోరని అంతేగాక ఇటువంటి భూ వివాదాలకు తావుండదని పేర్కొన్నారు
భూమి కొనుగోలు, అమ్మకాలు జరిగే సమయంలో రీ సర్వే ద్వారా అందిన పాస్ పుస్తకాలను రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ అధికారులు పరిశీలించి కొన్న వారి పేరుపై రిజిస్ట్రేషన్ జరుగుతుందని చెప్పారు
రైతుల భూమికి ప్రభుత్వమే పూర్త రక్షణ కల్పిస్తుందని రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే తమ ప్రభుత్వం ధ్యేయమన్నారు
ప్రజల ఆస్తులపై నాయకుల బొమ్మలు కాకుండా ప్రభుత్వ అధికారిక ముద్ర మాత్రమే ఉండాలని ఈ మార్పు తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్పష్టం చేశారు
ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,అధికారులు, రైతులు పాల్గొన్నారు

## దీపావళి నాటికి నందివెలుగు రోడ్ ఆర్ఓబి ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా పనుల వేగవంతం మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్




**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 03,**
2013-14లో మంజూరై, 2017లో పనులు ప్రారంభమై గత పదేళ్లుగా నిలిచిపోయిన నందివెలుగు రైల్వే వంతెన పనులను పునరుద్ధరించి, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు వేగవంతం చేశామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, రైల్వే, జీఎంసి, ఆర్‌డబి అధికారులతో కలిసి నందివెలుగు రోడ్ లోని ఆర్ఓబి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తొలుత ఇప్పటి వరకు జరిగిన పనులు, పెండింగ్ పనులపై అధికారులను, కాంట్రాక్టర్ ని వివరాలు అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ, సుదీర్ఘకాలం నిలిచిపోయిన ఆర్ఓబీ పనులన్నింటినీ దాదాపు రూ.39 కోట్లతో రీ-టెండర్ నిర్వహించి పనులనుపునఃప్రారంభించామన్నారు. ప్రస్తుతం పనులన్నీ తుది దశకు చేరుకున్నాయని, దాదాపు దీపావళి సమయానికి వంతెనను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పనుల్లో ఎదురవుతున్న గ్రావెల్ కొరత, ఒకవైపు ఉన్న గుడి వద్ద ట్రాఫిక్ సమస్యలను స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ క్లియర్ చేస్తున్నామని తెలిపారు. అలాగే పనుల నిమిత్తం రైల్వే గేట్‌ను రెండు రోజుల పాటు మూసివేసి పనులు పూర్తి చేయడంతో పాటు, మున్సిపల్ కార్పొరేషన్ సహాయంతో బ్రిడ్జి కింది ప్రాంతాన్ని సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు డిసెంబర్ 15 వరకు గడువు కోరినప్పటికీ, అదనపు సిబ్బందిని లేదా సబ్-కాంట్రాక్టర్లను ఉపయోగించి అంతకంటే ముందే పనులను ఫాస్ట్ ట్రాక్ చేసి పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

## బాపట్ల రూరల్ సీఐగా ఎస్. సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



**బాపట్ల, అక్టోబరు 3 (పెన్ పవర్):**
బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా ఎస్. సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది సీఐ సుబ్బారావుకు స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

## సామాన్య భక్తులే కేంద్రంగా దసరా ఉత్సవాల ఏర్పాట్లు




**విజయవాడ:పెన్ పవర్, అక్టోబర్, 03,**
విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్ తెలిపారు. శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి సీతమ్మవారి పాదాలు, కేశఖండనశాల, హోల్డింగ్ ఏరియాలు, వినాయక టెంపుల్, రథం సెంటర్, టోల్‌గేట్, ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. భక్తుల భద్రత, సౌకర్యాలు, సులభ దర్శనానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, క్యూలైన్లు, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు ఏఐ ఆధారిత డిస్‌ప్లే బోర్డులు, 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు ఏర్పాటు చేస్తున్నామని, పున్నమి ఘాట్‌లో నిర్వహించే జాతీయ సరస్ మేళాకు రాష్ట్రపతి రానున్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా 3,500 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, మొత్తం 22 పార్కింగ్ పాయింట్లు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. బూమ్ బ్యారియర్లు, యాక్సెస్ కంట్రోలర్లతో భద్రతను పర్యవేక్షిస్తామని, క్రౌడ్ అనలిటిక్స్ సాంకేతికత ద్వారా భక్తుల రద్దీని నిరంతరం అంచనా వేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడంతో పాటు ఉత్సవాల ప్రాంతాల్లో నిరంతరం పరిశుభ్రత నిర్వహిస్తామని తెలిపారు. స్వచ్ఛ దసరా లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, ప్రత్యేక దర్శనాలకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఆలయాన్ని ప్రత్యేక అలంకరణలతో ఆధ్యాత్మిక శోభతో తీర్చిదిద్దుతామని తెలిపారు. దసరా మహోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

## ప్రత్యేక పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ.. విద్యకు భరోసా డీఈవో ఎల్.చంద్రకళ




**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 03,**
ప్రత్యేకఅవసరాలుకలిగినపిల్లలనుచిన్నవయసులోనే గుర్తించి,వారికి అవసరమైన సహాయ సహకారాలు, వసతులు కల్పిస్తూ సాధారణ పిల్లలతో సమానంగా విద్యను అభ్యసించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) విద్య, గుర్తింపు, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలపై జిల్లాలోని ఎంఈవో-1, ఎంఈవో-2లకు శనివారం విజయవాడలోని సీవీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ఉపాధ్యాయులు చిన్న వయస్సులోనే గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశస్త యాప్ ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేసేలా ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు. స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించడంతో పాటు, వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, వైద్యం, పునరావాసం తదితరసేవలుసమర్థవంతంగాఅందేలాఅధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి భవిత సెంటర్‌లో సుమారు 20 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. భవిత సెంటర్ల ద్వారా పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఐదు మున్సిపాలిటీలకు ఒక ఆటిజం సెంటర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 2,351 మందికి పైగా సీడబ్ల్యూఎస్ఎన్ చిన్నారులు ఉన్నారని వెల్లడించారు.
జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నారాయణ మాట్లాడుతూ ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం, 2016 ప్రకారం 21 రకాల వైకల్యాలను ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం వివిధ రకాల ప్రయోజనాలను అందిస్తోందని చెప్పారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కొక్కరికి రూ. 6,000 చొప్పున, బాలికలకు రూ. 2,000 స్టైపెండ్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, విద్యాశాఖ అధికారులు, సహిత విద్యా సిబ్బంది, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు-కార్యకర్తల ఐక్యతే పార్టీకి కొండంత బలం: ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా పరిశీలకులు కొమ్మినేని నారాయణ, జిల్లా అధ్యక్షులు షేక్ జాన్ సైదా.




**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 03:**
నరసరావుపేట నియోజకవర్గ కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా ఎన్నికల పరిశీలకులు కొమ్మినేని నారాయణ, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ జాన్ సైదా, నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ శ్రేణులతో ఆత్మీయంగా సమావేశమై పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం, రానున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని అన్నారు. కార్యకర్తల ఐక్యత, అంకితభావం, క్రమశిక్షణతోనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై నడుస్తూ సమన్వయంతో పనిచేస్తే ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.
రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో క్షేత్రస్థాయి కమిటీలను పటిష్టం చేసి, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వంఅమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, పార్టీ విధానాలను గడపగడపకూ తీసుకెళ్లాలని అన్నారు.
కార్యకర్తలకు పార్టీ నాయకత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. నాయకులు నేరుగా కార్యకర్తలతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో సమావేశంలో నూతనోత్సాహంనెలకొంది. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు రానున్న మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొని పార్టీ విజయానికి అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, మండల, పట్టణ స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ విభాగాల బాధ్యులు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని త్వరితగతిన అభివృద్ధి చేయాలి సీపీఐ కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 03,**

వల్లూరివారితోట,కాకుమానువారితోట సమీపంలో ఉన్న సుమారు 13 ఎకరాల వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని త్వరితగతిన అభివృద్ధి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు.

గుంటూరులోని మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ స్థలంలో ఆరు ఎకరాలకు పైగా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని, మిగిలిన స్థలంలో వాకింగ్ ట్రాక్, పచ్చదనం, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. స్థలం అభివృద్ధి లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు.

గతంలో ఈ స్థలాన్ని విక్రయించే ప్రయత్నాలను సీపీఐ అడ్డుకుందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.5 కోట్ల




అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు పాల్గొన్నారు.

# బ్రాంచ్ మేనేజర్లతో “సమీక్షా సమావేశం” నిర్వహించిన జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన..





**గుంటూరు:పెన్ పవర్, అక్టోబర్, 03,**

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జీడీసీసీ బ్యాంకు 44 బ్రాంచ్‌ల మేనేజర్లతో బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సీఈఓ వీవీఎస్ ఫణికుమార్ , సీనియర్ అధికారులు, నోడల్ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ, రైతులకు, డ్వాక్రా సంఘాలకు బ్యాంకు ద్వారా త్వరితగతిన, విరివిగా రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని బ్రాంచ్ మేనేజర్లను ఆదేశించారు. బ్యాంకు సేవల కోసం వచ్చే ప్రతి ఖాతాదారుడితో మర్యాదగా, సానుకూలంగా వ్యవహరించి, వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలను సత్వరమే అందించాలని సూచించారు. రైతులు, మహిళా సంఘాలు, ఇతర అర్హత కలిగిన ఖాతాదారులకు రుణ సౌకర్యాలను మరింత విస్తరించాలని పేర్కొన్నారు.

బ్యాంకు సీఈఓ శ్రీ వీవీఎస్ ఫణికుమార్ గారు మాట్లాడుతూ, బ్యాంకు మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అధికారులను కోరారు. అదే విధంగా డిపాజిట్లను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, బ్యాంకు వ్యాపారాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

సమావేశంలో బ్యాంకు వ్యాపారాభివృద్ధి, రుణాల పంపిణీ, మొండి బకాయిల వసూళ్లు, డిపాజిట్ల సమీకరణ తదితర అంశాలపై బ్రాంచ్‌ల వారీగా సమీక్ష నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలను అధికారులు అందించారు.

# జాతీయ రహదారిపై ప్రమాదకర ఫ్లెక్సీలను తొలగించాలి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మాదాసు భాను ప్రసాద్ లేఖ

**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 03 :**

చిలకలూరిపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న అక్రమ, ప్రమాదకర ఫ్లెక్సీలను తక్షణమే తొలగించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత నియంత్రణ చర్యలు చేపట్టాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరుతూ వుయ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా కన్వీనర్, సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్ లేఖ రాశారు.

ఆగస్టు 27న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో, ఆ తర్వాత కూడా రోడ్డు ప్రమాదాల కారణంగా పలువురు మృత్యువాత పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. జాతీయ రహదారిపై భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు కంటి తుడుపు చర్యలకు పరిమితం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

జాతీయ రహదారిపై కూడళ్లు, మలుపులు, కార్నర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న భారీ ఫ్లెక్సీలు వాహనదారుల దృష్టికి తీవ్ర ఆటంకంగా మారుతున్నాయని భాను ప్రసాద్ తెలిపారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను తక్షణమే తొలగించి, భవిష్యత్తులో వాటిని ఏర్పాటు చేయకుండా శాశ్వత నియంత్రణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నెల రోజుల క్రితం అధికారులు జాతీయ రహదారిని పరిశీలించినప్పటికీ, ఇప్పటివరకు ప్రమాదకర ఫ్లెక్సీలపై తగిన చర్యలు తీసుకోలేదని ఆయన లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన దూర సూచిక బోర్డులపైనా



ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

అదేవిధంగా జాతీయ రహదారిపై పనిచేయని వీధి దీపాలను పునరుద్ధరించాలని, స్పీడ్ బ్రేకర్ల వద్ద జీబ్రా గీతలు, రోడ్ మార్కింగ్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

చిలకలూరిపేట జాతీయ రహదారిపై ప్రస్తుత భద్రతా పరిస్థితులను సమగ్రంగా పునఃసమీక్షించి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని నితిన్ గడ్కరీని మాదాసు భాను ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో కందా భాస్కర్, హరి ప్రసాద్, అదప రవి, మరుకొండ వెంకటరావు, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వ్యర్థాలతో గోవుల మృత్యువులు గోవుల యజమానులపై చర్యలు తీసుకోవాలి - బాలాజీ



**చీరాల, అక్టోబరు 3 (పెన్ పవర్):**

చీరాల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ముస్లిం షాదీఖానాకు వెళ్లే మార్గంలోని ఇదర్ ఎదురుగా నందీశ్వరుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న గో సంరక్షణ సమితి అధ్యక్షుడు బాలాజీ స్పందించి, మృతి చెందిన నందీశ్వరుడిని అక్కడి నుంచి తరలించి ఖననం చేయించారు.

ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ గోవులు, నందీశ్వరుల సంరక్షణపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదన్నారు. గోవుల యజమానులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుని జరిమానాలు విధించాలని కోరారు.

గోవులను రోడ్లపై వదిలేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యజమానులు గోవులను తమ సొంత ప్రదేశాల్లో ఉంచుకుని సంరక్షించాలని, సాధ్యం కాని పక్షంలో గోశాలలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రోడ్లపై పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల గోవులు, నందీశ్వరులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవోలకు అర్జీల ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాజాగా మృతి చెందిన నందీశ్వరుడు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు తినడం వల్లే మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

ఇకనైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గోవుల యజమానులందరితో సమావేశం నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలాజీ కోరారు. గోమరణాలను నివారించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. మృతి చెందిన నందీశ్వరుడిని తరలించి ఖననం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రానికి 3 లక్షల ఇల్లు కేటాయింపు మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 03**

రాష్ట్రానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద 3 లక్షల ఇళ్లను కేటాయించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమంతో పాటు ఆధునిక సాంకేతికతతో ఇళ్ల నిర్మాణానికి 3డీ హౌసింగ్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

బుర్రిపాలెంలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రానికి సుమారు 75 వేల ఇళ్లు వచ్చే అవకాశం ఉండగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమన్వయంతో 3 లక్షల ఇళ్ల కేటాయింపు సాధ్యమైందని వివరించారు.

3డీ హౌసింగ్ ప్రాజెక్టులో భాగంగా బుర్రిపాలెంలో 100, ఓబులనాయుడుపాలెంలో 70 ఇళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతతో





తక్కువ సమయంలో ఇళ్ల నిర్మాణం, కార్మిక వ్యయం, నిర్మాణ సామగ్రి వృథాను తగ్గించే అంశాలపై ఈ ప్రాజెక్టు ద్వారా అధ్యయనం చేయనున్నట్లు పేర్కొన్నారు. స్టార్టప్ సంస్థ సహకారంతో గత ఏడాదిన్నరగా ఈ ప్రాజెక్టుపై పరిశోధనలు చేస్తున్నామని, ఇప్పటికే ఒక నమూనా ఇంటిని నిర్మించి సాంకేతిక సమస్యలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ 170 ఇళ్ల నిర్మాణంతో 3డీ హౌసింగ్‌ను ప్రయోగాత్మక స్థాయి నుంచి వాస్తవ నిర్మాణంలోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్తులో గ్రామాల్లో 50 నుంచి 100 ఇళ్లను తక్కువ సమయంలో నిర్మించే అవకాశాలు ఉంటాయని పెమ్మసాని తెలిపారు. రేపు జరగనున్న కార్యక్రమాలను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.

# కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు హోరాహోరీగా జరిగిన బాలబాలికల రెజ్లింగ్ పోటీలు







**పెన్ పవర్ కారంపూడి అక్టోబర్ 3**

మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలో శనివారం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14 మరియు అండర్ 17 బాల బాలికల రెజ్లింగ్ పోటీలు ముమ్మరముగా కొనసాగుతున్నాయి ఈ పోటీలను ప్రధానోపాధ్యాయులు ఐ.శివ శేషిరెడ్డి ప్రారంభించారు.

ఈ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి సుమారుగా 400 మంది విద్యార్థులు రెజలింగ్ లో పాల్గొన్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వర్ణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రెజ్లింగ్ వ్యాయామఉపాధ్యాయులుభూషణం,ఆనంద్,మనోహర్ ,రత్నరాజు,అమల,సుస్మిత జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచివిచ్చేసినవ్యాయామఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు మరియు బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల భూ హక్కులకు భరోసా

**చీరాల, అక్టోబరు 3 (పెన్ పవర్):**

రైతుల భూ హక్కులకు భరోసా కల్పించడంతో పాటు భూ రికార్డులను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. చీరాల మండలం బుర్లవారిపాలెం గ్రామంలో నిర్వహించిన ‘మీ భూమి--మీ హక్కు’ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రీసర్వే, భూ రికార్డుల పరిశీలన తదితర ప్రక్రియల అనంతరం అర్హులైన రైతులకు నూతన పట్టాదారు



పాసుపుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వాన్ని పెంచడంతో పాటు భూ సంబంధిత సేవలను రైతులకు మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

నూతన పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదైన వివరాలను రైతులు పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవచ్చని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ‘పేదల సేవలో 2.0’ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించి ప్రజల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బుర్రిపాలెంలో పర్యటించిన మంత్రులు, కలెక్టర్

**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 3 :**

తెనాలి మండలం బుర్రిపాలెంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం పర్యటిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సీబా రాణి కొర్లపాటి, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ శనివారం బుర్రిపాలెంలో పర్యటించారు. ముఖ్య మంత్రితో పాటు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నత అధికారులు పాల్గొంటున్నారు. అక్టోబర్ 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు పి.ఎం.ఏ.వై గ్రామీణ్ క్రింద మంజూరైన గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. బుర్రిపాలెం గ్రామం పొలిమేరల్లో బహిరంగ సభను





ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో శంకుస్థాపన ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బహిరంగ సభకు హాజరు అయ్యే ప్రజలు, అధికారులు కూర్చొనుటకు ఏర్పాట్లు చేశారు. తాగు నీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఎ.టి.వి రవి కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, డి.ఎస్పీ బి.జనార్ధన రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ కార్డుల పంపిణీ

**చీరాల, అక్టోబరు 3 (పెన్ పవర్):**

వేట వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ ఆయిల్ సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలనిచీరాలఎమ్మెల్యేమద్దులూరిమాలకొండయ్య కోరారు. చీరాల మండలం బుర్లవారిపాలెం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు హైస్పీడ్ డీజిల్ ఆయిల్ సబ్సిడీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాడరేవు గ్రామానికి చెందిన 235 మంది మత్స్యకారులకు సబ్సిడీ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం ద్వారా ప్రతి లీటరు డీజిల్‌కు రూ.9 సబ్సిడీ లభిస్తుందని, నెలకు గరిష్ఠంగా 300 లీటర్ల వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉందన్నారు. వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు.

వేట వృత్తిని ప్రోత్సహించడంతో పాటు మత్స్యకారుల



కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వంఅందిస్తున్నప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. తీర ప్రాంత గ్రామాలను సమీకృత మత్స్య సంపద సముదాయాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మత్స్యశాఖ, రెవెన్యూఅధికారులు,కూటమినాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించాం ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 03,**
నగరంలో కేవలం మాటలు చెప్పడం కాదు, అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో పనులు చేసి చూపిస్తున్నాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నగర అభివృద్ధి కోసం కూటమి బలపరచిన అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాన'ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక శ్రీనగర్, మల్లికార్జున పేట, వసంతరాయపురం, ఆదిత్య నగర్, సాయినగర్, లాలాపేట పోలీస్ స్టేషన్ మెయిన్ లైన్ తోపాటు పాత గుంటూరులోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు రూ.9.43 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నలుదిక్కులా అన్ని విధాలుగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నందివెలుగు బ్రిడ్జి నిర్మాణానికి కనీసం తట్ట మట్టి కూడా వేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో 80 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. నగరంలో నాలుగు వైపులా ఆర్వోబీల నిర్మాణానికి చేపట్టామని, ప్రజలకు ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి





చేయబోతున్నామని తెలిపారు. గుంటూరు నగరానికి ముంపు సమస్య శాశ్వత పరిష్కారం చేసేందుకు 30 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న మొండిగేటు అభివృద్ధికి రూ.8 కోట్లు కేటాయించామని చెప్పారు. వినోభానగర్ వద్ద రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మించామని, ప్రతి వీధిలోనూ అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. క్రీడలకు పెద్ద పీట వేస్తూ బీఆర్ స్టేడియం అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించామని, రూ.14 కోట్లతో మల్టీపర్పస్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. వీటితోపాటు ఆర్టీసీ కాలనీలో మూడు పార్కులతోపాటు మరికొన్ని ప్రదేశాల్లో వాకింగ్ ట్రాక్ లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాత గుంటూరులో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నామని, రూ.3 కోట్లతో పనులు చేపడుతున్నామని చెప్పారు. రూ.2 కోట్లు కార్పొరేషన్, రూ.1 కోటి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అపరకర్మల భవనం, స్నానాల గదులు, సత్రం వంటి అన్ని రకాల వసతులు కల్పించనున్నామని తెలిపారు.

# రైతు బిడ్డల చదువులకు సైకిళ్ల వెన్నుదన్ను
# త్వరలోనే 20 కంప్యూటర్లతో హైటెక్ ల్యాబ్ ప్రారంభం

**టిడిపి కార్యాలయంలో 30 సైకిళ్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**

**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 03:**
పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి అన్ని విధాలా అండగా నిలిచి నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల ఆలోచనల మేరకు అమలు చేస్తున్న పి4 (పి4 - పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్షిప్) విధానంలో భాగంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు, దాతల సహకారంతో నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా భారత్ ఫౌండేషన్ (చైర్మన్ సజ్జా వెంకటేశ్వర్లు, ప్రతినిధుల) సహకారంతో శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 150 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నూతన సైకిళ్లను పంపిణీ చేశారు. వీటిలో కోటప్పకొండ వద్దనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు 120 సైకిళ్లు అందజేయగా, నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మిగిలిన 30 సైకిళ్లను పేద





విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలు, నిరుపేద వర్గాల పిల్లల చదువులకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటానని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద రైతులు, వ్యవసాయ కూలీల బిడ్డలు దూరప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త సైకిళ్లు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న వారికి ఈ సాయంఎంతోఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా బడులకు వెళ్లి చదువులో రాణించేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థుల కోసం తల్లికి వందనం, స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్స్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సీఎస్సార్ నిధులు, దాతల తోడ్పాటుతో 20 కంప్యూటర్లతో కూడిన హైటెక్ ల్యాబ్‌ను త్వరలోనే జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతల సాయంతో 14 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి సురక్షిత తాగునీరు అందిస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థుల సంక్షేమం, ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లైన్‌మెన్ల ప్రాణరక్షణే లక్ష్యంగా పోల్ క్లైంబింగ్ షూస్
# నన్నం తిరుపతిని అభినందించిన ఎమ్మెల్యే మాలకొండయ్య

**చీరాల, అక్టోబర్ 3 (పెన్ పవర్):**
విద్యుత్ సిబ్బంది ప్రాణరక్షణ కోసం వినూత్నమైన 'పోల్ క్లైంబింగ్ షూస్'ను రూపొందించిన చీరాలకు చెందిన నన్నం తిరుపతిని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అభినందించారు. శుక్రవారం తిరుపతి నిర్వహిస్తున్న పోల్ క్లైంబింగ్ షూస్ తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి, ఆవిష్కరణ వివరాలను తెలుసుకున్నారు.

విద్యుత్ లైన్‌మెన్లు స్తంభాలు ఎక్కే సమయంలో ఎదురయ్యే ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ఈ షూస్ ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరికరం తయారీతో పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల ద్వారా వేలాది మంది యువతకు సురక్షితమైన క్లైంబింగ్ మెళకువలపై శిక్షణ అందించి, పలువురు జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగాలు సాధించేందుకు సహకరించిన తిరుపతిని ఆయన అభినందించారు.

**జాతీయ స్థాయిలో 'అమేజింగ్ ఇండియన్' అవార్డు**
టైమ్స్ నెట్‌వర్క్ నిర్వహించిన 'అమేజింగ్ ఇండియన్ అవార్డ్స్ 2025-26' లో నన్నం తిరుపతి తన విభాగంలో జాతీయ విజేతగా నిలిచారు.





న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకున్నారు. సాంకేతిక ఆవిష్కరణల ద్వారా సమాజానికి సేవలందించిన వారిని ఈ అవార్డులతో సత్కరిస్తారు. తిరుపతి రూపొందించిన పోల్ క్లైంబింగ్ షూస్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థలకు సరఫరా అవుతున్నాయని తెలిపారు. ఈ ఉత్పత్తి తయారీ ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెజాన్ ఈ-కామర్స్ వేదిక ద్వారా దేశవ్యాప్తంగా ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

**తన విజయాన్ని లైన్‌మెన్లకు అంకితం**
తన ఆవిష్కరణకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల నన్నం తిరుపతి సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో రూపొందించిన ఆవిష్కరణకు జాతీయ అవార్డు దక్కడం మర్చిపోలేని గౌరవమన్నారు. తన విజయాన్ని తనను నమ్మిన లైన్‌మెన్ సోదరులకు, తన వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

# సివిల్ సప్లైస్ అధికారులకు ప్రత్యేక శిక్షణ

**హైదరాబాద్,అక్టోబర్ 3 (పెన్ పవర్):**
తెలంగాణలో ప్రభుత్వానికి ధాన్యం ఇవ్వకుండా బకాయి పడ్డ రైస్ మిల్లర్లకు ప్రభుత్వం స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. ప్రభుత్వ ధాన్యాన్ని తిరిగి ఇవ్వండి, లేదా మీ ఆస్తులను కోల్పోవడానికి సిద్ధపడండి. పౌర సరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర (ఐపీఎస్) ఆదేశాల మేరకు శాఖ ఈ కఠిన చర్యలకు సిద్ధమైంది..

దీని అమలు కోసం, రెవెన్యూ రికవరీ చట్టం కింద బకాయి ఉన్న మిల్లర్ల నుంచి డబ్బు వసూలు చేయడానికి పౌర సరఫరాల శాఖ ఒక స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. చట్టపరంగా ఆస్తులను వేగంగా, ఎలాంటి లోపాలు లేకుండా జప్తు చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పౌర సరఫరాల అధికారుల కోసం అక్టోబర్ 5 నుండి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల ఇన్‌స్టిట్యూట్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్ ) ఇవ్వని వారు లేదా కనీస మద్దతు ధర (ఎంఎస్పీ ) తో ప్రజల డబ్బుతో కొన్న ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించాలని చూసే మిల్లర్లను లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త రూల్స్




తెచ్చారు. అధికారుల తనిఖీలలో గోదాముల్లో ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలితే, వెంటనే శాఖ షోకాజ్ నోటీసు ఇస్తుంది. దీనిపై మిల్లర్లు సమాధానం చెప్పడానికి కేవలం ఏడు రోజుల గడువు మాత్రమే ఇస్తారు. ఆ తర్వాత కఠిన చర్యలు తీసుకుంటారు.
ఈ గడువులోగా మిల్లర్లు స్పందించకపోతే, రైస్ మిల్ యంత్రాలు, వాహనాలు మరియు బ్యాంకు అకౌంట్ల వంటి ఆస్తులను జప్తు చేయాలని జిల్లా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేస్తారు. ఈ ఆస్తులను అమ్మినా ప్రభుత్వ నష్టం తీరకపోతే, ఆ మిల్లర్ల భూములు, ఇళ్లు వంటి స్థిరాస్తులను కూడా సీజ్ చేసి బహిరంగ వేలం వేస్తారు.
ఎక్కడా ఎలాంటి తప్పులు జరగకుండా ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయడానికి, అధికారులకు ఈ వర్క్‌షాప్‌లలో శిక్షణ ఇస్తారు. ఏ చర్య తీసుకున్నా అది చట్టబద్ధంగా ఉండేలా, రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడటమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం. పక్కాగా తనిఖీలు ఎలా చేయాలి, పంచనామాలు ఎలా రాయాలి, వీడియో ఆధారాలను ఎలా సేకరించాలి అనే విషయాలపై డిప్యూటీ తహసీల్దార్లు (డీటీ ), అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్లకు (ఆక్సో) ఫీల్డ్ ట్రైనింగ్ ఇస్తున్నారు. అదే సమయంలో, బకాయిలు ఎంత ఉన్నాయో కచ్చితంగా లెక్కించడం, రికవరీ రికార్డులను నిర్వహించడంపై అసిస్టెంట్ మేనేజర్లు (ఎం), జిల్లా మేనేజర్లకు (డీఎం) కూడా ట్రైనింగ్ ఇస్తున్నారు. బకాయి పడ్డ మిల్లర్ల ఆస్తులను గుర్తించి వెంటనే జప్తు చేయడానికి, రెవెన్యూ అధికారులతో ఎలా కలిసి పని చేయాలనే దానిపై జిల్లా సివిల్ సప్లైస్ ఆఫీసర్లకు (ఐజూూ) కూడా సూచనలు ఇస్తున్నారు.
రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటూ, బకాయి పడ్డ మిల్లర్ల ఆస్తులపై ఎలాంటి సంకోచం లేకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోగలరని కోరారు.

# రూ.1.40 కోట్లతో కాంప్యాక్టరు వాహనం ప్రారంభం



**చీరాల, అక్టోబర్ 3, (పెన్ పవర్) :**
చీరాల మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.1.40 కోట్లతో కొనుగోలు చేసిన 42 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల కాంప్యాక్టరు వాహనాన్ని శనివారంచీరాలఎమ్మెల్యేమద్దులూరిమాలకొండయ్యప్రారంభించారు. రోజువారీ పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణ, తరలింపునకు ఈ వాహనం వినియోగించనున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకుఆధునికవాహనాలనుఅందుబాటులోకితీసుకువస్తున్నట్లతెలిపారు.ప్రజలకుపరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసెఫ్ డేనియల్, మున్సిపల్ శాఖ అధికారులు, మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వంకాయలపాడు ఎస్ డబ్ల్యూపిసి షెడ్‌లో క్లాప్ మిత్రులకు ఎక్స్‌పోజర్ టూర్.

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, అక్టోబర్ 03 :**
యడ్లపాడు మండలం వంకాయలపాడు ఎస్ డబ్ల్యూపిసి షెడ్ వద్ద మండల పంచాయతీ అభివృద్ధి అధికారులు, క్లాప్ మిత్రులు,షెడ్ మిత్రులకు చెత్త నిర్వహణపై ఎక్స్‌పోజర్ టూర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వానపాము ఎరువు తయారీ,నిర్వహణ, బిన్ బ్యాగ్ వినియోగం, తడి--పొడి చెత్తను వేరు చేయడం, స్వచ్ఛ రథం ద్వారా చెత్త సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోయడ్లపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. హేమలతాదేవి,డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ జాకీర్ హుస్సేన్, మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ అభివృద్ధి అధికారులు, క్లాప్ మిత్రులు, షెడ్ మిత్రులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును మర్యాదపూర్వకంగా కలిసిన నూతన టూటౌన్ సీఐ సురేంద్ర



**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 03:**
నరసరావుపేట రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా (సీఐ) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సురేంద్ర శనివారం నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబును ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు సీఐ సురేంద్ర పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన సురేంద్రకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత తదితర అంశాలపై ఎమ్మెల్యే కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలని సూచించారు. అసాంఘిక శక్తులపై, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్య ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా నిష్పక్షపాతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై పూర్తి నమ్మకం కలిగేలా పారదర్శక పాలన అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీస్ శాఖకు తమ వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# పశువుల తాగునీటి కోసం నాయనపల్లి ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదల

**వేటపాలెం, అక్టోబరు 3 (పెన్ పవర్):**
వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో పశువుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాయనపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కీర్తి పూర్ణచంద్రరావు చొరవతో నీటి సంఘం ఆధ్వర్యంలో ఈ నీటి విడుదల చేపట్టినట్లు కాల్వ అధ్యక్షుడు కీర్తి వెంకటేశ్వర్లు తెలిపారు.

**పశువుల తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ**
పంచాయతీ పరిధిలో గేదెలు, గొర్రెలు, మేకలకు తాగునీటి ఇబ్బందులు ఉన్న విషయాన్ని గుర్తించిన కీర్తి పూర్ణచంద్రరావు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకు కృషి చేసినట్లు తెలిపారు. ఆయన చొరవతో నీటి విడుదల జరగడంతో రైతులు, పశుపోషకులకు ప్రయోజనం కలగనుంది. పశువుల తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కీర్తి వెంకటేశ్వర్లు కోరారు.



# పేటలో అక్రమ పీడీఎస్ బియ్యం పట్టివేత

**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 03 :**
చిలకలూరిపేట పట్టణ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం 4:30 గంటల సమయంలో బోసు రోడ్డులోని ఎరువుల గోడౌన్ వెనుక అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో తన్నీరు నాగమ్మ అనే మహిళ అక్రమంగా నిల్వ ఉంచిన 12 బస్తాల (మొత్తం ఆరు క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినందుకు గాను సదరు మహిళపై అధికారులు 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో పల్నాడు జిల్లా అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ షేక్ రోషన్ జమీర్ భాష, డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వర్లు, వీఆర్వో షేక్ మస్తాన్ పాల్గొన్నారు.



# నానో యూరియాపై ప్రదర్శన క్షేత్రం






**యాదాద్రి భువనగిరి, హైదరాబాద్,, పెన్ పవర్, అక్టోబర్ 03 :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపహాడ్ గ్రామంలో గజ్జెల్లి శంకరయ్య పొలంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకంలో భాగంగా నానో యూరియా వాడకంపై ప్రదర్శన క్షేత్రంను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంను సులభతరం చేయడం, నిలువ మరియు రవాణా చేయడం సులభం, లేబర్ ఖర్చు తగ్గుతుంది పర్యావరణ పరిరక్షణ చేస్తుంది రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది అధిక దిగుబడి కోసం మరియు రైతుల ఆదాయం పెరుగుతుంది నాణ్యమైన ఆహారంను సాధ్యం చేస్తుంది భూమి యొక్క సమతుల్యతను కాపాడు తుంది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంబటి వేణు, గ్రామ సర్పంచ్ సుంకరి మంజుల, సుంకరి పర్శరాములు మరియు రైతులు పాల్గొన్నారు.

# తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాషకు ప్రేరణా కేంద్రంగా నిలవాలి

## -2026 ప్రతిభా పురస్కారాల ప్రదానంలో వెంకయ్యనాయుడు ఆకాంక్ష

**హైదరాబాద్,, పెన్ పవర్, అక్టోబర్ 03 :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యం లోని వివిధ రంగాల్లో విశేష సేవలు, కృషి చేసిన 12 మంది ప్రముఖులకు 2026 ప్రతిభా పురస్కారాలను భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అందచేశారు. శనివారం తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ముప్పవరపు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, తెలుగు విశ్వవిద్యాలయం లాంటి సంస్థలు కేవలం డిగ్రీల కర్మాగారాలు కాకుండా, తెలుగు భాషా సంస్కృతులకు ప్రేరణా కేంద్రంగా,తెలుగు జాతికి సాంస్కృతిక ధర్మపీఠం గా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భాష శ్వాస లాంటిదని, తెలుగు అమ్మ భాషాగా వెలుగుతూ, తల్లిదండ్రులు పిల్లలకు విధిగా తెలుగు ప్రాచీన కళలను నేర్పించాలని పిలుపునిచ్చారు . ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టముండదని గొప్ప ప్రతిఫలం ఉంటుందని అన్నారు. ప్రాథమిక విద్యలో తెలుగు భాషకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ

తెలుగు సాహిత్యంలోని ప్రముఖులచే నియమింపబడిన నిపుణుల సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీ మూర్తులను వివిధ విభాగాల్లో ఈ పురస్కారాలకు ఎంపిక చేసిందని వివరించారు




వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు అతిథులను, పురస్కార గ్రహీతలను వేదికపైకి ఆహ్వానించారు. తెలుగు వర్సిటీ భాషా సాహిత్య రంగాలకు చేస్తున్న కృషిని వివరించారు. పురస్కారాలను అందుకున్న వారిలో కవితా విభాగంలో శ్రీ కొట్ల వెంకటేశ్వర రెడ్డి, విమర్శలో ఆచార్య ఎన్. భక్తవత్సల రెడ్డి, చిత్రలేఖనంలో కూరెళ్ల శ్రీనివాస్, శిల్పంలో ఎ.ఎస్. ప్రకాష్, నృత్యంలో డా. హెచ్. అనిత, సంగీతంలో శ్రీ దుడ్డు సీతారామయ్య, పత్రికారంగంలో డా. వై. నాగేశ్వరరావు, నాటకరంగంలో సురభి వెంగమాంబ, జానపద కళారంగంలో తూర్పాటి సాలమ్మ, అవధానంలో డా. ఎం.వి. పట్వర్ధన్, ఉత్తమ రచయిత్రిగా ఆచార్య కాత్యాయని విద్మహే, నవల విభాగంలో కస్తూరి మురళీకృష్ణ ఉన్నారు. కార్యక్రమానికి విస్తరణ సేవా విభాగం ఇంచార్జ్ నెల్లుట్ల శ్రీకాంత్ సమన్వయకర్తగా వ్యవహరించారు. పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.30,116 నగదు, శాలువ, సత్కార పత్రం అందజేసారు

# నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

## -వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,, పెన్ పవర్, అక్టోబర్ 03 :** రాష్ట్రంలో నూనెగింజలు, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం, ఉత్పత్తిని పెంచడంతో పాటు రైతులకు నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం సచివాలయంలో శ్రీ రైతు నేస్తం కార్యక్రమంలో రబీ 2026-27 నూనెగింజలు, పప్పుధాన్యాల విత్తన పంపిణీని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాతీయ తినదగిన నూనెలు--నూనెగింజల మిషన్ (టీవీజూ-ూూ) కింద రబీ 2026-27లో 29,375 క్వింటాళ్ల నూనెగింజల విత్తనాలను 52,425 ఎకరాల్లో పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం రూ.36.76 కోట్ల సబ్సిడీ అందించనున్నారు. వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వుల పంటలకు ధృవీకరించిన విత్తనాలను రైతులకు అందించనున్నారు.నూనెగింజల సాగులో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించేందుకు 1,200 ఎకరాల్లో బ్లాక్ స్థాయి ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వీటి ద్వారా రైతులకు మెరుగైన సాగు పద్ధతులు, అధిక దిగుబడుల సాధనపై అవగాహన కల్పించనున్నారు.పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్ (పీూచీూ) కింద రబీ 2026-27లో 29,008 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలను సుమారు 1.09 లక్షల ఎకరాలకు పంపిణీ



చేయాలని ప్రణాళిక రూపొందించారు. శనగ, మినుము, పెసర పంటలకు సబ్సిడీపై విత్తనాలను అందించనున్నట్లు మంత్రి తెలిపారు. నూనెగింజలు, పప్పుధాన్యాల దేశీయ ఉత్పత్తిని పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం ద్వారా దేశంలో ఆత్మనిర్భరత సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందుబాటులోకి తీసుకురావడం, సాగు ఉత్పాదకతను పెంచడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా వ్యవసాయ శాఖ సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు.

# ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి -సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,, పెన్ పవర్, అక్టోబర్ 03 :** రాష్ట్రంలో విద్య, వైద్యానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. శనివారం సీఎంవో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల నిర్మాణం, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను గుర్తించి నియామక ప్రక్రియను మొదలు పెట్టాలని, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికారాలను కొనుగోలు చేసి, ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆసుపత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లాకు సంబంధించి జిల్లా స్థాయిలో ప్రతీ వారం వీటిపై సమీక్ష నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా సమావేశంలో అధికారులతో చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పిల్లలు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు

## -తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్,, పెన్ పవర్, అక్టోబర్ 03 :** నల్సా ఆధ్వర్యంలో జరుగుతున్న దక్షిణ మండల ప్రాంతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం సంతోషం అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. నిన్న మన దేశం, యావత్ ప్రపంచం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుందని గుర్తు చేశారు. గాంధీజీ ముందుగా ఒక న్యాయవాది. ఆయన న్యాయాన్ని కేవలం వృత్తిగా చూడలేదు. పేదలు, బలహీనుల కోసం న్యాయాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించారు. అదే స్ఫూర్తితో న్యాయ సేవా సంస్థలు కూడా పనిచేస్తున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందాలి. డబ్బు లేకపోవడం వల్ల ఎవరికీ న్యాయం దూరం కాకూడదన్నారు. ఈ సదస్సుకు పిల్లల సైబర్ భద్రత అనే చాలా ముఖ్యమైన అంశాన్ని ఎంచుకున్నందుకు జస్టిస్ విక్రమ్ నాథ్ కి , నల్సా కు గవర్నర్ ధన్యవాదాలు తెలిపారు. నేడు పిల్లలు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు. కానీ తమ పిల్లలు ఇంటర్నెట్‌లో ఏం చేస్తున్నారు అనేది చాలా మంది తల్లిదండ్రులకు తెలియడం లేదన్నారు.

ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన జీవితాలను ఎంతో సులభం చేశాయన్నారు. ప్రపంచంలోని సమాచారం మన చేతిలోకి వచ్చిందని, ఎక్కడున్న వారితోనైనా, ఎప్పుడైనా మాట్లాడగలుగుతున్నాం గవర్నర్ వివరించారు. కానీ పిల్లలు అమాయకులు. ఏది నిజం? ఏది అబద్ధం? ఏది మంచిది? ఏది ప్రమాదకరం? అన్నది వారు వెంటనే గుర్తించలేరని గవర్నర్ తెలిపారు. తెలియక పిల్లలు చేసే చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీయవచ్చని గవర్నర్ పేర్కొన్నారు. వాటి ప్రభావం పిల్లలపైనే కాదు... వారి కుటుంబాలపై, సమాజంపై కూడా పడుతుంది. ఇంటర్నెట్ ఈ నేరాలను సృష్టించలేదు. కానీ నేరాలను ప్రపంచవ్యాప్తంగా చేయడం మరింత సులభం చేసిందని గవర్నర్ వివరించారు.భయంతో పిల్లలు తమ సమస్యలను ఎవరికీ చెప్పలేకపోవచ్చు. అందుకే మన ముందున్న ప్రశ్నలు చాలా ముఖ్యమైనవని గవర్నర్ అన్నారు. పిల్లలపై సైబర్ నేరాలను ఎలా అరికట్టాలి? మన పిల్లలను ఎలా సురక్షితంగా ఉంచాలి?



బాధిత పిల్లలకు న్యాయం ఎలా అందించాలి అని ఆలోచన చేయాలన్నారు.

తెలంగాణలో మహిళలు, పిల్లల రక్షణ ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని గవర్నర్ అన్నారు. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు ఉన్నాయని గవర్నర్ తెలిపారు. భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకే చోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నామని గవర్నర్ వివరించారు. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గవర్నర్ చెప్పారు.

పిల్లల రక్షణ కోసం పోలీసు శాఖలోని విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో షీ -భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయన్నారు.

సైబర్ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం అని గవర్నర్ తెలిపారు. విద్యార్థులనే సైబర్ అంబాసిడర్లుగా తయారు చేసి, తమ తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే పిల్లలకు రక్షణ లభిస్తుందని గవర్నర్ స్పష్టం చేశారు. బాధితులకు అవసరమైన ప్రతి సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని, ఆర్థిక సహాయం నుంచి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించడం వరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ చెప్పారు. టీజీఎస్ -ఎల్ఎస్ఏ పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది అని తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారని గవర్నర్ పేర్కొన్నారు ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చామని గవర్నర్ తెలిపారు.

న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం కాదు. న్యాయం అంటే బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం అని గవర్నర్ అన్నారు.

ముఖ్యంగా... ఒక బిడ్డ కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయం అని గవర్నర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అన్ని శాఖలకు గవర్నర్ ఒక ముఖ్యమైన

తెలంగాణ హైకోర్టు, టీజీఎస్-ఎల్ఎస్ఏతో కలిసి చర్చించి పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం సమగ్ర చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేయాలని గవర్నర్ ఆదేశించారు. న్యాయ సేవా సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు, ప్రతి గ్రామానికి చేరేలా మా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని గవర్నర్ అన్నారు . పిల్లల ఆన్‌లైన్ భద్రతపై జరిగే ప్రతి చర్చలో తల్లిదండ్రులు భాగం కావాలని సూచించారు. ప్రతి పిల్లవాడు, ప్రతి తల్లిదండ్రి సైబర్ నేరాల కోసం -- 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం -- 1098 నంబర్లు తప్పక గుర్తుంచుకోవాలని గవర్నర్ అన్నారు. తల్లిదండ్రులకు నా విజ్ఞప్తి ఒక్కటే...మీ పిల్లలతో మాట్లాడండి. వారు ఇంటర్నెట్‌లో ఏం చేస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఏం చూస్తున్నారు? తెలుసుకోండి. కానీ వారిని తప్పుపట్టేలా కాదు... ఆసక్తితో, అవగాహనతో మాట్లాడండి అని గవర్నర్ సూచించారు. ఎందుకంటే... వాళ్లు మన పిల్లలు. వారికి మన మద్దతు కావాలి. మన మార్గదర్శకత్వం కావాలన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా... మన ప్రేమ, మన అవగాహన కావాలని గవర్నర్ అన్నారు. మన పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం అని గవర్నర్ పిలుపునిచ్చారు.

# కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

## మెట్రో, ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్,, పెన్ పవర్, అక్టోబర్ 03 :** హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, టీజీఎస్‌ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది? మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ప్రయాణం సులభమైందా? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

**ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన**

కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు.

**బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చట**

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్‌ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రో--బస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం: భట్టి**

ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో





మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు 'సీమ్‌లెస్' ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం**

హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని







పేర్కొన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజా రవాణా వైపు ఆకర్షించాలంటే ఆర్టీసీ, మెట్రో సేవలను సమన్వయంతో, సౌకర్యవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు డైలీ పాస్, మంత్లీ పాస్‌తో **పాటు కామన్ పాస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.**

ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా అందుబాటులో ఉండేలా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజా రవాణా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్--మెట్రో) ఎన్.వి.ఎస్.రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కూటమి 'ఆపరేషన్ బొత్స'.. సీనియర్ నేతకు ఊహించని దెబ్బ



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ సీనియర్ నాయకుడు, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ లక్ష్యంగా కూటమి చేస్తున్న రాజకీయం ఆసక్తి రేపుతోంది. దాదాపు 15 ఏళ్లుగా మంత్రిగా పనిచేయడమే కాకుండా, ఉత్తరాంధ్ర రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగిన బొత్సకు ఊహించని షాక్ ఇచ్చేలా అధికార టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారని అంటున్నారు. వైసీపీని కోలుకోలేని దెబ్బతీయాలంటే ముందుగా బొత్సను రాజకీయంగా నిర్వీర్యం చేయాలని టీడీపీ అగ్రనేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. ఇందులో భాగంగా బొత్స కుటుంబ సభ్యుల నుంచి మొదలుపెట్టి ఆయన అనుచరులు, సన్నిహితులను వైసీపీ నుంచి దూరం చేయాలని పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నారని అంటున్నారు. దీంతో ఉత్తరాంధ్రలో ముఖ్యంగా విజయనగరం జిల్లా వైసీపీలో ఎప్పుడు ఏ వికెట్ పడిపోతుందో తెలియని గందరగోళం నెలకుందని చెబుతున్నారు.

విజయనగరం జిల్లాలో అధికార తెలుగుదేశం పార్టీకి గట్టి ప్రత్యర్థిగా నిలబడిన బొత్సను రాజకీయంగా తేరుకోలేని విధంగా దెబ్బ కొట్టాలని టీడీపీ పెద్దలు ప్లాన్ చేసినట్లుగా ఉందని అంటున్నారు. బొత్సకు నీడగా తిరిగిన ఆయన మేనల్లుడు చిన్న శ్రీనును దూరం చేయడమే కాకుండా, ఆయన ద్వారా విజయనగరం జిల్లాలో బొత్స అనుచరులు అందరినీ వైసీపీ నుంచి బయటకు రప్పించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇందుకోసం రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. బొత్సపై తిరుగుబాటు చేసేలా కొందరిని ప్రోత్సహించడంతోపాటు తమతో చేతులు కలిపితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఊరడించడం ద్వారా మరికొందరని టీడీపీ, జనసేనలోకి తెచ్చేలా ప్లాన్ జరుగుతోందని అంటున్నారు. ఇప్పటికే టీడీపీలో చేరిన జడ్పీ మాజీ చైర్మను చిన్న శ్రీనుకు ఈ బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. ఆయన వైసీపీలో తనకు తెలిసిన వారు అందరితో మాట్లాడుతూ, టీడీపీలోకి వస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నట్లుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వైసీపీలో బొత్స నాయకత్వాన్ని ప్రశ్నించేలా మరికొందరిని ఎగదోసే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా చెబుతున్నారు.

ఈ క్రమంలో వైసీపీ నుంచి సస్పెన్షన్ కు గురైన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కూడా చిన్న శ్రీనుతో చేతులు కలిపినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ విధంగా మాజీ మంత్రి బొత్స కుటుంబ సభ్యుల ద్వారానే ఆయనను నిలువరించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇన్నాళ్లు బొత్స కోసమే పనిచేసిన వారికి సరైన గుర్తింపు లేదని, క్షేత్రస్థాయిలో ఒకరు పనిచేస్తే, పదవులు అన్నీ బొత్స ఆయన వారసులు అనుభవిస్తున్నారని ప్రచారం చేయడం ద్వారా ఆయన సన్నిహితులను కూడా ప్రభావితం చేసేలా ప్లాన్ జరుగుతోందని అంటున్నారు. ఈ విషయమై బొత్స అనుచరులు, సన్నిహితులు కూడా ఆలోచనలకు లోనవుతున్నారని అంటున్నారు.

**టీడీపీ ప్రచారాన్ని నమ్ముతారా?**

ఇక బొత్స లక్ష్యంగా సాగుతున్న ప్రచారంపై ఆయన అనుచరులు, సన్నిహితులు ఎంతవరకు నమ్ముతారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. బొత్స అధికారంలో ఉండగా, ఆయన కుటుంబ సభ్యులే ఎక్కువ పదవులు అనుభవించారని కూటమి ప్రచారం చేస్తుండగా, తాజాగా టీడీపీలో చేరిన జడ్పీ మాజీ చైర్మన్ చిన్న శ్రీను కూడా బొత్స బంధువు అన్న విషయాన్ని ఎత్తిచూపుతున్నారు. పార్టీ మారిన తర్వాత చిన్న శ్రీను కూడా బొత్స మాదిరిగా వ్యవహరిస్తే తమ పరిస్థితి ఏంటి? అని ప్రశ్నిస్తున్నట్లుగా చెబుతున్నారు. అయితే వైసీపీలో పరిస్థితులకు, టీడీపీ రాజకీయాలకు మధ్య తేడాలను చూపుతూ ఆపరేషన్ వైసీపీ చేసేలా టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. మొత్తానికి చిన్న శ్రీను ద్వారా ఆపరేషన్ వైసీపీ కాస్త ఆపరేషన్ బొత్సగా మారిందని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రలోభాల పర్వంలో ఎక్కువ మంది బొత్స అనుచరులు, సన్నిహితులతో చర్చలు జరుగుతున్నాయని అంటున్నారు.

# "వై నాట్ పులివెందుల" - కూటమి గర్జన, జగన్ హై అలర్ట్!

**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఏపీలో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ముఖ్యంగా గత స్థానిక ఎన్నికల్లో వైట్ వాష్ కు గురైన ప్రస్తుత అధికార కూటమి ఇప్పుడు విపక్షానికి అదే పరిస్థితి తీసుకురావాలని పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా వైనాట్ పులివెందుల అంటూ నినదించడమే కాకుండా, విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గంలో మెజార్టీ సీట్లను గెలుచుకునే వ్యూహంతో పనిచేస్తోందని చెబుతున్నారు. గతంలో జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, వైనాట్ 175, వై నాట్ కుప్పం అంటూ నినాదాలు చేసేవారు. ఇప్పుడు కూటమిలో ముఖ్యనేతలు ఆ విధమైన ప్రకటనలు చేయకపోయినా, పులివెందులలో జగన్మోహనరెడ్డికి ఓటమి రుచి చూపించాలనే లక్ష్యంతోనే అడుగులు వేస్తున్నట్లుగా సంకేతాలు పంపుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ఇప్పటివరకు ఆయన కుటుంబానికి ఎదురులేకుండా పోయింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా ఈ నియోజకవర్గంలో పోటీపై పెద్దగా దృష్టి పెట్టేవారు కాదని చెబుతున్నారు. జగన్మోహనరెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన నుంచి పులివెందుల నియోజకవర్గం ఆ కుటుంబానికి కంచుకోటగా ఉండగా, వైఎస్ ఆ తర్వాత జగన్ రెడ్డి చెప్పిన వారికే స్థానిక పదవులు దక్కేవి. అయితే గత ప్రభుత్వంలో జగన్మోహనరెడ్డి అనుసరించిన విధానాలు కారణంగా ప్రతిపక్ష నేతలకు బలమైన స్థానాల్లో కూడా ఆయా పార్టీలు పోటీ చేసే వాతావరణం లేకుండా పోయిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే ఎన్నికల్లో అలాంటి వాతావరణం లేకపోయినా ప్రజాస్వామ్యయుతంగానే పోరాడి వైసీపీని ఓడించాలని కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు. గత ఏడాది జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఉప




ఎన్నికల్లో టీడీపీ అనూహ్య విజయం సాధించగా, వైసీపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ రాలేదు. దీంతో గట్టిగా ప్రయత్నిస్తే పులివెందుల నియోజకవర్గంలో మెజార్టీ నియోజకవర్గాలను కైవసం చేసుకోవచ్చునని టీడీపీ కూటమి ప్లాన్ చేస్తోందని అంటున్నారు. ప్రధానంగా వైఎస్ ఫ్యామిలీకి తిరుగులేని బలం ఉన్న పులివెందుల నగర పంచాయతీలో పసుపు జెండా ఎగరవేయాలనే వ్యూహంతో టీడీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీలో ఉన్న కొందరితో చర్చలు సాగిస్తున్నారని కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కూడా స్వయంగా రంగంలోకి దిగినట్లుగా చెబుతున్నారు.

**జగన్ రెడ్డి ఫోకస్**

అధికార పార్టీ 'వై నాట్ పులివెందుల' అంటుండటంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అలర్ట్ అయ్యారని చెబుతున్నారు. ప్రతిపక్ష నేతల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న మాజీ సీఎం జగన్ రెడ్డి పార్టీ శ్రేణులు చేయిదాటిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కడప ఎంపీ అవినాశ్ రెడ్డికి దిశానిర్దేశం చేశారని అంటున్నారు. అదేసమయంలో ముఖ్యమైన కార్యకర్తలతో జగన్ రెడ్డి స్వయంగా మాట్లాడుతూ అధికార పార్టీ ప్రలోభాలకు లొంగవద్దని, తాను ఉన్నానని భరోసా ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఇక జగన్ రెడ్డి సూచనలతో ఎంపీ అవినాశ్ రెడ్డితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, వైసీపీ ముఖ్యనేతలు నియోజకవర్గంలో పట్టు సడలకుండా పకడ్బందీ వ్యూహరచన చేస్తున్నారని అంటున్నారు. దీంతో పులివెందుల రాజకీయం హాట్ హాట్ గా మారిందని చెబుతున్నారు.

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్ సభ భారీ సక్సెస్

**హైదరాబాద్ పెన్ పవర్:**

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన హార్టికల్చర్ హబ్ సభ భారీ సక్సెస్ అయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల కాదర భాష పేర్కొన్నారు. శనివారం రాయచోటి లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గాజుల ఖాదర్ బాషా మాట్లాడారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లె హార్టికల్చర్ హబ్ సభకురాయచోటి నుండి తండోపతండాలుగా ప్రజలు రైతులు. తరలి వెళ్లారని వివరించారు. రాయలసీమలో వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు హార్టికల్చర్ హబ్ ఎంతో బలం. చెప్పారు. మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి నుండి పెద్ద ఎత్తున మదనపల్లె నందు జరిగిన హార్టికల్చర్ హబ్ సభకు తరలివచ్చిన ప్రజలు మరియు రైతులు కు హృదయపూర్వక అభినందనలు నమస్కారములు గాజుల ఖాదర్బాషా తెలియజేశారు..రాయలసీమలో వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు హార్టికల్చర్ హబ్ ఎంతో బలమని తద్వారా ఉద్యాన పంటలకు మార్కెట్ గిట్టుబాటు ధరలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు హార్టికల్చర్ హబ్ తో ఒకపక్క రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని దీనివల్ల రాయలసీమలోని రైతులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రపంచ చరిత్రలోనే ఏ దేశంలో లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు కృషితో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు ఒక చారిత్రాత్మకమైన విషయమని ఇది చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకైక లక్ష్యం రాయలసీమను రతనాల సీమగా చూడాలన్నది ఆయన లక్ష్యం అని తెలిపారు దేశానికే వెన్నముకా రైతులని రైతులు సంతోషంగా ఉండాలని రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది అనే నినాదంతో అన్నదాతకు ప్రయోజనం చేకూర్చేందుకు ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు ఐటి విద్యాశాఖ మంత్రివర్యులునారా లోకేష్ బాబు యొక్క కృషితో రిలయన్స్ అధినేత అనంత్ అంబానీ కి కష్టపడి ఒప్పించి మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయడం అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు కూడా శంకుస్థాపన చేయడం 2026 అక్టోబర్ టు సీమ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎంతో ముందుకు వెళుతుందని రాయలసీమను ఒకపక్క వాటర్ సెక్యూర్డ్ రీజియన్ గా తీర్చిదిద్దే ప్రయత్నం కూడా చేస్తున్నారని తెలిపారు రైతుల కుటుంబంలో చంద్రబాబు నాయుడు పుట్టినారు కాబట్టి ఆయనకు రైతుల కష్టాలు బాగా తెలుసు అని 1997లోనే ఇజ్రాయిల్ నుంచి డ్రిప్ ఇరిగేషన్ తీసుకొచ్చి రైతులకు చంద్రబాబు పరిచయం చేశారని చెప్పారు ఎన్నో పత్రికలలో చంద్రబాబు చూపించిన విధులను చూసి చంద్రబాబును వాటర్ మాన్ గా రాస్తే వైసిపి పార్టీ ఓర్వలేక నానా దుర్భాష పదజాలాలు వాడినారని తెలిపారు ఈరోజు రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు చంద్రబాబు నాయుడు పరిపాలనపై నమ్మకంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని చంద్రబాబు నాయుడు ఒక్కరే రైతుల గురించి రాత్రింపగలు ఆలోచిస్తున్నారని గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు అప్పుల్లో కురుకుపోయారని వైసీపీ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మొదటి స్థానంలో అప్పుడు ఉన్నదని ఇప్పుడు ప్రతి రైతు హాయిగా చంద్రబాబు నాయుడు దీవెనలు అందిస్తున్నారని తెలిపారు తీవ అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతు ఖాతాలో 20000 రూపాయలు జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబు నాయుడు ఒక్కరే అని తెలిపారు అలాగే రాయచోటి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోరాయచోటి రూరల్ టిడిపి మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ తో వైసీపీ పార్టీలో వణుకు పుట్టిందన్నారు. రాయచోటి నియోజకవర్గం నుండి చలో మదనపల్లెకు మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అశేష జనవాహిని తరలి వెళ్లడం చూసి వైసిపి నాయకులకు మతిభ్రమించిందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. లక్ష కోట్ల రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అంటే మామూలు విషయం కాదని, పది జిల్లాల్లో 201 క్లస్టర్లలో అభివృద్ధి ప్రణాళిక అని తెలిపారు. వైసీపీ నాయకులు కరువు వచ్చిందని దాని గురించి సహేతుకంగా మాట్లాడడం లేదని, ఏదో మాట్లాడాలని మాట్లాడుతున్నారే తప్ప అందులో విషయమే లేదన్నారు. చంద్రబాబు నాయుడు విమర్శించే అర్హత వారికి లేదని,ఎల్ ని నో ప్రభావంతో ప్రపంచమంతా వర్షపాతం తక్కువగా నమోదు అవుతున్నదని తెలిసినా కూడా విమర్శించడం తగదన్నారు. మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరోనా మహమ్మారితో రాష్ట్ర ప్రజలు దుర్భర పరిస్థితులు గడిపారని తల్లి ఒకచోట బిడ్డ ఒకచోట బ్రతకవలసి వచ్చిందని ఆ రోజు తమ పార్టీ వాళ్లు కష్టానికి సహకరించారే గాని మీలాగా నీతి తప్పి ప్రవర్తించి మాట్లాడలేదన్నారు. ప్రపంచంలోని దిగ్గజ దేశాలు, బిల్ గేట్స్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా భావితరాలకు ముందు చూపును చూపించే నాయకుడు చంద్రబాబు నాయుడు పొగుడుతుంటే మీరు విమర్శించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇలాంటి కరువు పరిస్థితులు వచ్చినప్పుడే కదా ధైర్యంగా ముందుకు నిలబడి, వర్షపాతం తక్కువ గా నమోదైన గాని రాయలసీమను రత్నాలసీమగా చూడాలని సంకల్పంతో నదుల అనుసంధానం చేయాలని పట్టుదలతో పని చేస్తున్న ఉక్కుమనిషి మా చంద్రబాబు నాయుడు కొనియాడారు. వైసీపీ నాయకులు కరువును కూడా రాజకీయంగా వాడుకోవడం సిగ్గుచేటు అన్నారు.

## కార్యకర్తా...ఎక్కడున్నావయ్యా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏడుకొండల స్వామీ ఎక్కడున్నావయ్యా అని భక్తులు భక్తి పారవశ్యంగా పాడుకుంటారు. అది ఆధ్యాత్మిక తత్వం. రాజకీయాల్లో కూడా అసలైన స్వామి కార్యకర్త అన్నది తెలిసిందే. ఎన్నికల సమయంలో స్వామి ఆ మీదట ఆసామి అన్న సెటైర్లు కూడా కార్యకర్తల మీద ఉన్నాయి. అంటే కూరలో కరివేపాకు అన్న మాట. కార్యకర్తలు గట్టిగా పూనుకోకపోతే ఏ పార్టీకి అయినా విజయాలు దక్కవు అన్నది పచ్చి నిజం. బూత్ లెవెల్ నుంచి క్షేత్ర స్థాయిలో ఎక్కడ ఎన్నికల సమరం జరిగినా ముందుండే సైనికుడు కార్యకర్త. ప్రతీ పార్టీకి జీవగర్ర కార్యకర్త అని స్పష్టంగా చెప్పాల్సిందే. అయితే కార్యకర్తలతో అవసరం ఉన్నపుడే దగ్గరకు తీస్తున్నారు. ఒక్కసారి అధికారం దక్కితే మాత్రం వారికి ఎక్కడో వదిలేస్తున్నారు. పదవులు పవర్ అన్నీ కూడా నాయకుల చుట్టూ తిరిగేవారికే దక్కుతున్నాయి. దాంతో అసలైన కార్యకర్తలు మాత్రం తీరని అన్యాయానికి గురి అవుతున్నారు.

**వారికే వందనం :**

కార్యకర్తలే కీలకం అని ఇపుడు అన్ని పార్టీలు వల్లిస్తున్నాయి. వారితో తాము అని కూడా చెబుతున్నాయి. కార్యకర్తలను పట్టించుకుంటూ వారికే పట్టం కడుతూ నాయకుల ప్రసంగాలు సాగుతున్నాయి. మీరు లేకపోతే మేము లేమని సెంటిమెంట్ డైలాగులు కూడా కొడుతున్నారు. చిత్రమేంటి అంటే ఏ పార్టీ అయినా అధికారం దక్కాక కార్యకర్తలను చిన్న చూపు చూడడం షరా మామూలు వ్యవహారంగానే ఉంటోంది. ఇక టీడీపీలో అయితే కార్యకర్తల విషయంలో ఒక చానల్ ని ఏర్పాటు చేసి ఎంతో కొంత గుర్తింపు ఇస్తున్నారు. వైసీపీ విషయానికి వస్తే క్యాడర్ ని విస్మరించడం వల్లనే 2024 లో చేదు ఫలితాలు వచ్చాయన్నది తెలిసిందే. 2019 కి ముందు ఏకంగా పదేళ్ల పాటు పార్టీ కోసం తమ జీవితాలను అర్పించిన కార్యకర్తలు వైసీపీలో ఎంతో మంది ఉన్నారు.

**రెక్కలు ముక్కలు చేసుకుని :**

వైఎస్సార్ మీద ప్రేమ జగన్ మీద అభిమానం ఇవన్నీ వారి చేత ఎందాకైనా అన్నట్లుగా పరిశ్రమ చేయించాయి. జగన్ ముఖ్యమంత్రి కావాలని గట్టి పట్టుదలతో వారు ఆనాటి అధికార ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో అన్ని విధాలుగా నష్టపోయారు. కాలం, వయసు, ధనం కుటుంబాలు ఇలా అన్నీ కూడా ధారపోసి వైసీపీని గెలిపిస్తే ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను పూర్తిగా పక్కన పెట్టేసింది. కార్యకర్తలకు పార్టీకి మధ్యలో వాలంటీర్ల వ్యవస్థను తీసుకుని వచ్చింది. దీంతో కార్యకర్తలు నివ్వెరపోవాల్సి వచ్చింది. తాము పార్టీలో ఉన్నామా లేదా అన్న సంశయంతో పాటు ఆత్మ గౌరవం దెబ్బతిని తీరని అవమానంతో ఆ అయిదేళ్ళూ గడిపారు. అధినాయకత్వం తీరు అలా ఉంటే నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల వరసగా అలాగే ఉంది. వారి చుట్టూ ఉంటే అనుచరులకే ప్రాధాన్యత ఇస్తూ సిసలైన కార్యకర్తలను అసలు ఏ మాత్రం పట్టించుకోలేదు. దాంతో కార్యక్రర్త పార్టీ జెండా వదిలేశాడు. దానికి వైసీపీ భారీ మూల్యం 2024 ఎన్నికల్లో చెల్లించుకోవాల్సి వచ్చింది.

**అండగా ఉంటామని అంటూ :**

భారీ ఓటమి తరువాత వైసీపీకి తత్వం బోధపడిందా లేక కార్యకర్తలతో అవసరం పడిందా అన్నది పక్కన పెడితే ఇపుడు కార్యకర్తల వద్దకు వెళ్తున్నారు. మీరే మాకు కావాలని మొక్కుతున్నారు. బాగా చూసుకుంటామని నమ్మబలుకుతున్నారు. ఇలా ఇపుడు రెండేళ్ళ తరువాత కార్యకర్తల వద్దకు వైసీపీ నేతలు పరుగులు పెట్టి మరీ వెళ్తున్నారు. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికలు వారితోనే చేయాల్సి ఉంది కాబట్టి. వైసీపీ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో సమావేశాలను ఏర్పాటు చేస్తోంది. అలా చేయమని అధినాయకత్వం ఆదేశించింది. అంతే కాదు పార్టీ తరపున గుర్తింపు కార్డులు కూడా కార్యకర్తలకు అందచేస్తున్నారు ఈ ఐడెంటిటీ కార్డులు ఉన్న వారికి ఐదు లక్షల ప్రమాద బీమా సదుపాయం కూడా కల్పించారు. మీకు మేము అన్ని విధాలుగా మద్దతుగా ఉండి సహకరిస్తామని నాయకులు చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడాలని సూచిస్తున్నారు.

**ముఖాలను చూపించకుండా :**

అయితే ఈ ఐడెంటిటీ కార్డులు ప్రమాదం ముంచుకొస్తే అపుడు కుటుంబానికి వచ్చే పరిహారాలు కాదు తమకు ఏమైనా అవకాశాలు దక్కుతాయా లేదా అన్నదే కార్యకర్తలు నాయకులను అడుగుతున్న ప్రశ్న. తాము ఇప్పటికి పదిహేనేళ్ళుగా పార్టీ కోసం పనిచేసి ఏమీ కాకుండా పోయామన్న ఆవేదన అయితే ప్రతీ వైసీపీ కార్యకర్తలో నిండా ఉంది. కనీసం పార్టీ నాయకులు తమ ముఖాలను కూడా చూపించకుండా గడిపేశారు అన్న విమర్శలు ఉన్నాయి. ఇపుడు తాపీగా మీకు మేమున్నామని అంటూంటే క్యాడర్ దానిని ఏ విధంగా తీసుకుంటుంది అన్నది చర్చగా ఉంది మరి.

**పనిచేసే వారికి :**

నిజానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేసే వారిని గుర్తించి పోటీ చేయించమని వైసీపీ అధినాయకత్వం గట్టిగా చెబుతోంది. కానీ గతంలోనూ ఇపుడూ కూడా పార్టీ నాయకుల చుట్టూ తిరిగే కొందరికే అవకాశాలు ఉంటున్నాయని వాపోతున్న వారు ఉన్నారు. బలం ఉన్న వారిని సమర్థులను గుర్తించి ప్రోత్సహిస్తేనే ఆశించిన ఫలితాలు దక్కుతాయని అంటున్నారు. ఈ విషయంలో వైసీపీ క్యాడర్ లో అంతర్మధనం సాగుతోంది. తమకు చాన్స్ దక్కాల్సిందే అన్న డిమాండ్ అయితే సర్వత్రా వినిపిస్తోంది. కార్యకర్తలు ఎక్కడ ఉన్నారని వెతుక్కుంటూ రావడం కాదని వారికి గుర్తింపు గౌరవం ఇవ్వడమే కాకుండా రాజకీయ అవకాశాలు అందిస్తే వారే అందరి కంటికీ స్పష్టంగా కనిపిస్తారు అని అంటున్నారు. మరి స్థానిక ఎన్నికల్లో వైసీపీ నిజమైన కార్యకర్తలకు పట్టం కడుతుందా లేక వారి అవసరం కోసం ఈ విధంగా హామీలు ఇస్తోందా అన్నది తొందరలోనే తేలిపోతుందని అంటున్నారు. కార్యకర్తలే పార్టీకి అసలైన ఆస్తి అన్న సంగతిని ఇప్పటికైనా గుర్తెరిగితేనే వైసీపీకైనా మరే పార్టీకైనా సుదీర్ఘమైన భవిష్యత్తు ఉంటుందని అంటున్నారు.

## జనసేనలో పెరుగుతున్న ఆశావహులు.. కంట్రోల్ చేయడం కష్టమేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన పార్టీలో ప్రస్తుతం పదవులు మరియు టికెట్ల కోసం అంతర్గత పోటీ మరియు ఆశావహుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024 ఎన్నికల్లో 100 శాతంస్ట్రైక్ రేట్‌తో విజయం సాధించి, ప్రస్తుతం అధికార కూటమిలో భాగస్వామిగా ఉండటంతో పార్టీకి ఆదరణ పెరిగింది. రాబోయే 2026 స్థానిక సంస్థల ఎన్నికలనేపథ్యంలో క్షేత్రస్థాయిలో పోటీ మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ పరిస్థితికి దారితీసిన ముఖ్య కారణాలు మరియు తాజా పరిణామాలు క్రింది విధంగా ఉన్నాయి. పాత కమిటీల రద్దు చేయడంతో కొత్త నియామకాలపై ఆశలు పెరిగాయి. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు వీలుగా జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల పాత కమిటీలను రద్దు చేశారు. త్వరలోనే నూతన సంస్థాగత కమిటీల నియామకం చేపట్టనుండటంతో, పదవుల కోసం దశాబ్ద కాలంగా కష్టపడిన పాత జనసైనికులతో పాటు కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి మధ్య గట్టి పోటీ నెలకొంది.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో పెరిగిన పోటీ...**

రాబోయే మున్సిపల్, పంచాయతీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది. ముఖ్యంగా గత ఎన్నికల త్యాగాలను గుర్తుచేస్తూ తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కేడర్ డిమాండ్ చేస్తోంది. స్థానిక ఎన్నికల వ్యూహాలను పర్యవేక్షించేందుకు పవన్ కళ్యాణ్ ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక ప్యానెల్‌ను నియమించారు. దీనికి మంత్రి కందుల దుర్గేష్ సమన్వయకర్తగావ్యవహరిస్తున్నారు. పొత్తుల నేపథ్యంలో సీట్లు తగ్గుతాయన్న ప్రచారంపై పవన్ కళ్యాణ్ కేడర్‌కు స్పష్టతనిచ్చారు."మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే కుదరదు" అని స్పష్టం చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు తగినన్ని స్థానాలు దక్కాలని పట్టుబడుతున్నారు. ఒకవేళ ఒకే వార్డు లేదా స్థానంలో మిత్రపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరని పరిస్థితి వస్తే, స్నేహపూర్వక పోటీకైనా సిద్ధపడాలని, ఎక్కడా వెనక్కి తగ్గవద్దని నాయకులకు దిశానిర్దేశం చేశారు.

**సీట్ల కేటాయింపులో...**

సీట్ల కేటాయింపు మరియు అంతర్గత సర్దుబాట్ల విషయంలో కేడర్ అసంతృప్తికి లోనుకాకుండా ఉండేందుకు పార్టీ పీఏసీ చైర్మన్ మరియు మంత్రి నాదెండ్ల మనోహర్ నిరంతర సమీక్షలు జరుపుతున్నారు. సీట్ల కేటాయింపులపై తుది నిర్ణయం పూర్తిగా పవన్ కళ్యాణ్‌దేనని, కేడర్ అంతా క్రమశిక్షణతో ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.

## ఆసియా క్రీడలు: హాకీలోనూ 'డబుల్ గోల్డ్'.. పురుషుల స్వర్ణం కూడా భారత్ కైవసం

- ఆసియా క్రీడల హాకీలో భారత్‌కు స్వర్ణ పతకం
- ఫైనల్‌లో మలేషియాపై 5-1 తేడాతో ఘన విజయం
- తొలిసారి పురుషులు, మహిళల జట్లు రెండూ స్వర్ణం సాధించి రికార్డు
- ఈ విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత



ఆసియా క్రీడల హాకీలో భారత పురుషుల జట్టు పసిడి విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మలేషియాను 5–1 గోల్స్ తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఈ విజయంతో భారత జట్టు వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన జట్టుగా నిలవడమే కాకుండా, లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో భారత పురుషుల హాకీ జట్టుకు ఇది ఐదో స్వర్ణం కావడం విశేషం.జపాన్‌లోని గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆట 11వ నిమిషంలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, 14వ నిమిషంలో మలేషియా ఆటగాడు షెల్లో సిల్వేరియస్ ఫీల్డ్ గోల్ చేసి స్కోరును 1–1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కానీ, ఆ తర్వాత భారత ఆటగాళ్లు మలేషియాకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 23వ నిమిషంలో జుగరాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌తో, 42వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌తో గోల్స్ సాధించి భారత్‌కు 3–1 ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో మరింత దూకుడు పెంచిన భారత్, 54వ నిమిషంలో శిలానంద్ లక్రా ఫీల్డ్ గోల్, 57వ నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరో పెనాల్టీ కార్నర్ గోల్‌తో 5–1 తేడాతో భారీ విజయాన్ని ఖరారు చేశారు.

### చారిత్రాత్మక డబుల్ గోల్డ్

ఈ ఆసియా క్రీడలు భారత హాకీకి చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. శుక్రవారం జరిగిన మహిళల ఫైనల్‌లో భారత జట్టు చైనాను 1–0 తేడాతో ఓడించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే.

తాజాగా పురుషుల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో, ఒకే ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు గెలవడం ఇదే తొలిసారి.

ఈ టోర్నీ ఆద్యంతం భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. హోరాహోరీగా సాగిన సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆఖరి నిమిషంలో గోల్ చేసి 4–3 తేడాతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. అంతకుముందు లీగ్ దశలో ఇండోనేషియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి జట్లపై భారీ గోల్స్ తేడా తో విజయాలు నమోదు చేసి తన సత్తా చాటింది. ఈ అద్భుత విజయంతో భారత హాకీ జట్టు ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్స్‌కు సిద్ధమవుతోంది.

## ఆరంభంలో వెనుకంజ.. చివర్లో పతకాల పంజా!

# ఆసియా క్రీడల్లో భారత్ జోరు



రెండు రోజుల క్రితం పతకాల పట్టికలో భారత్ టాప్–10లో కూడా లేదు. తర్వాత పుంజుకొని టాప్–5లోకి దూసుకొచ్చింది. ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా.. చివరి రెండు రోజుల్లో భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. వరుసగా స్వర్ణాలు సాధిస్తూ పతకాల వేటలో కొత్త ఊపు తీసుకొచ్చారు. హాకీ, క్రికెట్ నుంచి ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ వరకు సత్తా చాటారు. మొత్తంగా 21 స్వర్ణాలు సహా 85 పతకాలతో ఆసియా క్రీడల ప్రస్థానాన్ని 4వ స్థానంతో ముగించారు. కొన్ని విభాగాల్లో నిరాశ ఎదురైనా.. మరికొన్ని క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు.

### చివర్లో ఒక్కసారిగా జోరు!

ఆసియా క్రీడల్లో భారత్ ప్రస్థానం ఒడుదొడుకులతో సాగింది. గురువారం నాటికి ఖాతాలో 10 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. పతకాల పట్టికలో టాప్–10 కింద నిలిచింది. అయితే చివరి రెండు రోజుల్లో సీన్ మారిపోయింది. క్రికెట్, హాకీ జట్లు పసిడి పతకాలు సాధించాయి. ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ భారత క్రీడాకారులు మెరిశారు. దీంతో చివరి రెండు రోజుల్లోనే మరో 11 స్వర్ణాలు ఖాతాలో చేరాయి. భారత్ టాప్–5లోకి దూసుకొచ్చింది.

### హాకీలో చరిత్ర.. క్రికెట్‌లోనూ పసిడి

ఈసారి భారత హాకీ జట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల జట్టు కూడా మలేసియాపై 5–1తో ఘన విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఈ విజయాలతో రెండు జట్లూ 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించాయి. క్రికెట్‌లోనూ పురుషులు, మహిళలు స్వర్ణాలు గెలిచి భారత్ ఖాతాలో పసిడి పతకాలు జమ చేశారు. కబడ్డీలోనూ ఇరు జట్లు స్వర్ణ విజేతలుగా నిలిచాయి.

### ఆర్చరీలో అమ్మాయిల అదుర్స్!

ఆర్చరీలో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. ఈ విభాగంలో ఐదు స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించారు. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో 17 ఏళ్ల కుమ్‌కుమ్ స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది. మహిళల రికర్వ్ జట్టు కూడా తొలిసారి పసిడి పతకాన్ని అందుకుంది. నీరు ధండా షూటింగ్‌లో మహిళల ట్రాప్ విభాగంలో స్వర్ణం గెలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ వ్యక్తిగత స్వర్ణంతో మెరిసింది.

### అథ్లెటిక్స్‌లో అత్యధిక పతకాలు

భారత్‌కు అత్యధిక పతకాలు అందించింది అథ్లెటిక్సే. ఈ విభాగంలో 24 పతకాలు వచ్చాయి. ఒక స్వర్ణం, 9 రజతాలు, 14 కాంస్యాలు దక్కాయి. షూటింగ్‌లో 15, ఆర్చరీలో 9 పతకాలు లభించాయి. బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు వచ్చాయి. రెజ్లింగ్‌లో అమన్ శెహ్రావత్, సుజీత్ కల్కల్ స్వర్ణాలు సాధించగా.. లవ్లీనా బోర్గోహెయిన్, పర్వీన్ హూడా, అంకుశ్ పంఘాల్ బాక్సింగ్‌లో పసిడి పతకాలు గెలిచారు.

## ఆరంభంలో తడబడ్డా.. రాహుల్ సెంచరీతో భారత్ భారీ స్కోరు.. రోహిత్ శతకం మిస్



వెస్టిండీస్‌తో మూడో వన్డేలో ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బల నుంచి కోలుకున్న భారత జట్టు భారీ స్కోరు చేసింది. కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీతో చెలరేగాడు. రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ కూడా రాణించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. తొలుత 4 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ రోహిత్, గైక్వాడ్ ఆదుకున్నారు. ఆ తర్వాత రాహుల్ తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. దీంతో విండీస్ ముందు 352 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. విండీస్ బౌలర్లు ఆరంభంలో భారత బ్యాటర్లను బాగా ఇబ్బంది పెట్టారు. పిచ్ నుంచి లభించిన సహకారంతో జేడెన్ సీల్స్ చెలరేగాడు. శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (0)లను పెవిలియన్‌కు పంపి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. దీంతో భారత జట్టు 4 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది.ఈ దశలో రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ బాధ్యత తీసుకున్నారు. ఆరంభంలో ఆచితూచి ఆడిన ఈ జోడీ క్రమంగా వేగం పెంచింది. విండీస్ ఫీల్డర్లు గైక్వాడ్ ఇచ్చిన క్యాచ్‌లను వదిలేయడం అతడికి కలిసొచ్చింది. ఇద్దరూ అర్ధశతకాలు సాధించి మూడో వికెట్‌కు 137 పరుగులు జోడించారు. రోహిత్ 92 పరుగులు చేయగా.. గైక్వాడ్ 57 పరుగులతో రాణించాడు. నమన్ ధీర్ సైతం 30 పరుగులు చేసి భారత స్కోరును ముందుకు తీసుకెళ్లడంతో కీలక పాత్ర పోషించాడు.ఇక, కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను తనదైన శైలిలో ముందుకు నడిపించాడు. విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి పరుగుల వేగం పెంచాడు. కేవలం 80 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్నాడు. చివరి వరకు క్రీజులో నిలిచి 129 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. రాహుల్ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ 350 పరుగుల మార్కును దాటి భారీ స్కోరు సాధించింది.



# కాంతార పార్ట్ 3.. కొత్త ప్రొడ్యూసర్ ఎంట్రీ తప్పదా?





కాంతార 3 ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్ లో ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రశ్న మొదలైంది. ఈసారి సినిమా కంటే నిర్మాత గురించే చర్చ జరుగుతోంది. రిషబ్ శెట్టి– హోంబలే ఫిల్మ్స్ కాంబోలో వచ్చిన రెండు చిత్రాలు భారీ విజయాలు సాధించిన నేపథ్యంలో.. మూడో పార్టు కోసం కొత్త ప్రొడ్యూసర్ రంగంలోకి దిగుతున్నారనే టాక్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

అయితే కాంతార ఫ్రాంచైజీ నుంచి మూడో సినిమా రావడం దాదాపు ఖాయమే. రిషబ్ శెట్టి ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం కథ, స్క్రిప్ట్ కు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. కాంతార మొదటి సినిమా 2022లో వచ్చింది. చిన్న బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని స్థాయిలో విజయం సాధించింది. రిషబ్ శెట్టి యాక్టింగ్, దర్శకత్వంతో పాటు కథ, దైవ విశ్వాసాల నేపథ్యం ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి.ఆ విజయంతో కాంతార ఒక సినిమాగా కాకుండా పెద్ద ఫ్రాంచైజీగా మారింది. ఆ తర్వాత కాంతార: చాప్టర్ 1ను భారీ స్థాయిలో తెరకెక్కించారు. మొదటి సినిమాతో పోలిస్తే ఈసారి బడ్జెట్ కూడా పెరిగింది. అయినా బాక్సాఫీస్ దగ్గర సినిమాకు భారీ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మూడో భాగంపై అంచనాలు మరింత పెరిగాయి. రిషబ్ శెట్టి కథను మరో స్థాయికి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడే కొత్త చర్చ మొదలైంది.కాంతార మొదటి రెండు సినిమాలను నిర్మించిన హోంబాలే ఫిల్మ్స్ మూడో భాగంలో కూడా కొనసాగుతుందా లేదా అనే దానిపై క్లారిటీ లేదు. రిషబ్ శెట్టి మరో నిర్మాణ సంస్థతో కలిసి కాంతార 3 చేయబోతున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆ చర్చకు ప్రధాన కారణం రిషబ్ శెట్టి, హోంబాలే ఫిల్మ్స్ కు సంబంధించిన కొన్ని సోషల్ మీడియా సిచ్యువేషన్స్. కాంతార యానివర్సరీ సందర్భంగా రిషబ్ శెట్టి సినిమా మోమోరీస్ షేర్ చేసుకున్నారు.అయితే ఆ పోస్టులో హోంబాలే ఫిల్మ్స్ ప్రస్తావన కనిపించలేదు. అటు హోంబాలే ఫిల్మ్స్ కూడా స్పెషల్ పోస్టు చేసింది. అందులో రిషబ్ శెట్టి ప్రస్తావన లేదు. దీంతో రిషబ్, హోంబలే మధ్య ఇంకా డిఫరెన్సెస్ పెరిగాయా అంటూ నెటిజన్లు డిస్కస్ చేసుకుంటున్నారు. గతంలో కూడా రిషబ్ శెట్టి హోంబలే ఫిల్మ్స్ ను సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేశారంటూ వార్తలు వచ్చాయి. అలాగే క్రియేటివ్ డిఫరెన్సెస్, డబ్బు విషయంలో విభేదాలు ఉన్నాయంటూ కొన్ని ఊహాగానాలు వినిపించాయి.కానీ వాటిపై ఇప్పటి వరకు ఎవరూ రెస్పాండ్ అవ్వలేదు. అందుకే ప్రస్తుతం కాంతార 3కి కొత్త నిర్మాత వస్తున్నారని చెప్పడం కంటే.. కొత్త నిర్మాత వచ్చే అవకాశం ఉందనే చర్చ మాత్రమే నడుస్తోందని చెప్పాలి. మరి కాంతార 3 నిర్మాణం విషయంలో చివరకు ఏ నిర్ణయం తీసుకుంటారనేది చూడాలి. హోంబలే ఫిల్మ్స్ కంటిన్యూ అవుతుందా, లేక కొత్త నిర్మాణ సంస్థ వస్తుందా అనే దానిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చిన తర్వాతే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com